Follow: @ANNTELUGU

23-04-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 142 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## క్షమించరాని ఘటన

### రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రాహుల్, సీఎం రేవంత్ సహా దేశం దిగ్భ్రాంతి

### వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ

**ఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని అత్యంత హేయమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్టులు పెట్టారు. ''పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.

మిగతా 3లో

టాప్ న్యూస్

## ఏపీ నుండి స్మృతి ఇరానీ?

- రాజ్యసభకు ఎంపిక చేసే ఛాన్స్
- విజయసాయి ఖాళీలోకి బీజేపీ ఛాయిస్


02



## మహేష్ బాబుకు ఈడి నోటీస్

- ఈనెల 27న విచారణకు పిలుపు
- సాయిసూర్య డెవలపర్స్ యాడ్ పారితోషికం లెక్కలపై వివరణ

08



## భూభారతి రైతులకు శ్రీరామరక్ష

- ప్రజల సూచనలతో అవసరమైతే భూభారతిలో మార్పులు
- రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02





## హైడ్రాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జై

- ప్రశంసిస్తూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం లేఖ
- కూకట్‌పల్లి నల్ల చెరువును పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడంపై హర్షం
- ప్లాట్లు ఉన్న వారికి నష్టపరిహారం చెల్లించాలని వినతి

వివరాలు 2లో



## రిటైరైనా వదిలేది లేదు

- లగచర్ల బాధితులను కొంతమంది పోలీసులు వేధిస్తున్నారని తెలిసింది : కేటీఆర్
- మూడేళ్లలో అధికారంలోకి వచ్చి చర్యలు తీసుకుంటాం
- సీఎం క్షమాపణ చెప్పాలి, పోలీసులను తొలగించాలని డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టుకు వెళతా


వివరాలు 3లో

### మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన పంచాయతీ రాజ్ ఉద్యోగులు

గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు విడుదల పట్ల హర్షం

వివరాలు 2లో





# సీఎం రేవంత్ జపాన్ పర్యటన సక్సెస్

### ముగిసిన పర్యటన.. నేడు రాష్ట్రానికి సీఎం

### సాధించిన పెట్టుబడులు: రూ.12,062 కోట్లు

### 30,500 ఉద్యోగాల కల్పనకు అవకాశం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పర్యటన విజయవంతమైంది. వారం రోజుల ముఖ్యమంత్రి పర్యటనలో రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించగా, వీటి ద్వారా 30,500 ఉద్యోగాల కల్పన జరగనుంది. వీటితో పాటు హైదరాబాద్ నగరాన్ని పర్యావరణ హితంగా మలిచేందుకు, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్ళేందుకు జపాన్ లోని పలు ప్రాంతాలను సందర్శించి అంచనాకొచ్చారు. తెలంగాణ యువతకు జపాన్ లో ఉద్యోగాలు, హైదరాబాద్ లో జపనీస్ పాఠశాల ఏర్పాటు వంటివి కూడా చర్చించారు.

**జపాన్ పర్యటన విజయాలు ఇవీ మారుబెని కంపెనీ**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం; రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి, ₹5,000 కోట్ల పెట్టుబడుల అంచనా. 30,000 ఉద్యోగాలు.

మిగతా 2లో

## హిరోషిమా మాదిరిగానే పోరాటానికి చిహ్నం తెలంగాణ

- కలిసికట్టుగా మెరుగైన ప్రపంచాన్ని నిర్మిద్దాం
- హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

02

# ఇంటర్ ఫలితాలు విడుదల

## బాలికలే మళ్ళీ టాప్

### రిజల్ట్స్ ను విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 65.96 శాతం ఉత్తీర్ణత

### ఇంటర్ రెండో సంవత్సరంలో 71.37 శాతం ఉత్తీర్ణత

### ఉత్తీర్ణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు




**మహా :** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 66.89 శాతం, సెకండియర్‌లో 71.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో గతేడాది కంటే పాస్ పర్సంటేజ్ పెరిగిందని భట్టి చెప్పారు. ఈ ఏడాది ఫలితాల్లో అమ్మాయిలదే పై చేయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో బాలికలు 73 శాతం, ఇంటర్ సెకండియర్‌లో 77.73 శాతం ఉతీర్ణత సాధించారని వెల్లడించారు. మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని.. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఇంటర్ బోర్డు వారం గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పాసైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 2లో


## గద్దర్ అవార్డులు గ్రేట్

### ఎంట్రీలు భారీగా వచ్చాయి

- జ్యూరీ ఛైర్మన్ గా నన్ను ఎన్నుకున్నందుకు థ్యాంక్స్.. నేను 76 సినిమాలు చూస్తా
- ఏఎన్ఎన్-మహాతో జయసుధ ఎక్స్ క్లూజివ్

**హైదరాబాద్, మహా:** దాదాపు పద్నాలుగేళ్ళ తర్వాత తెలుగు నటులకు ప్రభుత్వం అవార్డులు ఇస్తుండడం అభినందనీయమని, గద్దర్ సినిమా అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం గొప్ప విషయమని

మిగతా 2లో



## నేడే హైదరాబాద్ ఎమ్మెల్సీ ఫైట్

### ఎంఐఎం, బీజేపీ మధ్య పోటీ.. పోలింగ్ కు సర్వం సిద్ధం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 22 ఏళ్ల తర్వాత ఎన్నిక జరుగుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ ఎన్నికలో మొత్తం 112 మంది ఓటర్లు ఉండగా 81 మంది కార్పొరేటర్లు, 31 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

మిగతా 5లో




## సివిల్స్‌లో తెలంగాణ సత్తా

కానిస్టేబుల్ కొడుకు కలెక్టర్ అయ్యిండు

వివరాలు 2లో



## ఆపరేషన్ కర్రెగుట్ట

మావోయిస్టులను చుట్టుముట్టిన భద్రతాబలగాలు భీకర యుద్ధం!

05



## జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి

27 మంది పర్యాటకుల దుర్మరణం

### మరో 20మందికి తీవ్ర గాయాలు.. పెరుగుతున్న మృతుల సంఖ్య

- విహారానికి వచ్చిన వారిపై విరుచుకుపడ్డ ఉగ్రమూకలు
- హైదరాబాద్ కు చెందిన ఐబి ఆఫీసర్ సహా గుజరాత్, తమిళనాడు, ఒడిస్సాకు చెందిన పలువురు మృతి
- దాడి సమాచారం అందిన వెంటనే స్పందించిన మోదీ.. అమిత్ షాకు ఫోన్
- హుటాహుటిన కాశ్మీర్ కు హోంమంత్రి.. దుర్ఘటనను ఖండించిన రాహుల్ గాంధీ, రేవంత్, ఓవైసీ

03

## చంపింది మేమే.. టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ ప్రకటన

వివరాలు 3లో



# సీఎం రేవంత్ జపాన్ పర్యటన సక్సెస్



(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం; రూ.10,500 కోట్ల పెట్టుబడులు.

**తోషిబా ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (TTDI):** రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామాగ్రి తయారీ ఫ్యాక్టరీ; ₹562 కోట్ల పెట్టుబడులు. టామ్ కామ్ (TOMCOM) తో టెర్న్, రాజ్ గ్రూప్: జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు ఒప్పందం. ముఖ్యమంత్రి బృందం జపాన్ పర్యటన ముగిసింది. బుధవారం హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

## హిరోషిమా మాదిరిగానే పోరాటానికి చిహ్నం తెలంగాణ

కలిసికట్టుగా మెరుగైన ప్రపంచాన్ని నిర్మిద్దాం.. హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని "తెలంగాణ రైజింగ్" బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల బృందం ఘనంగా స్వాగతించింది. ముఖ్యమంత్రి వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, అధికారులు జయేష్ రంజన్, వి. శేషాద్రి, అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం' అని అన్నారు. 'శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని అన్నారు. తెలంగాణను సందర్శించి, రాష్ట్రప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్ వేగా.. ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందని అన్నారు. హిరోషిమాహైదరాబాద్, జపాన్‌తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామన్నారు. అసెంబ్లీ సందర్శన తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం, శాసన సభ్యుల బృందం రేవంత్ రెడ్డి బృందాన్ని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల వద్దకు తీసుకెళ్లింది.


# ఇంటర్ ఫలితాలు విడుదల

## ఫస్ట్ ఇయర్‌లో 66.89 శాతం

సెకండ్ ఇయర్ లో 71.37 శాతం ఉత్తీర్ణత

పాస్ పర్సంటేజీ పెరిగిందన్న డిప్యూటీ సీఎం భట్టి



(మొదటిపేజీ తరువాయి)

అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. కాగా, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు మొత్తం 9,97,012 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు తమ ఫలితాలను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ www.tgbie.cgg.gov.in లో చూసుకోవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఈసారి ప్రతీ విద్యార్థి మొబైల్ ఫోన్‌కు ఫలితాల లింక్ పంపనున్నట్లు వెల్లడించారు. లింక్‌పై క్లిక్ చేసి హాల్ టికెట్ వివరాలు నమోదు చేసి ఫలితాలు పొందవచ్చని చెప్పారు. గతంలో సర్వర్ డౌన్ లాంటి సమస్యలు ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఈసారి అలాంటి సాంకేతిక సమస్యలు ఎదురవకుండా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలిపారు. కాగా, ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇంటర్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఫలితాల నేపథ్యంలో ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం విద్యార్థుల మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) పంపారు. 'పరీక్షల్లో జయాపజయాలు సహజం. ఫెయిలయ్యారనో, ఆశించిన విధంగా మార్కులు రాలేదనో నిరుత్సాహ పడవద్దు. మరింత శ్రమించండి.. రెట్టింపు పట్టుదలతో పోరాడండి. విజయం మీ బానిస అవుతుంది' అంటూ స్ఫూర్తిదాయక సందేశాన్ని పంపారు. ప్రతి విద్యార్థికీ ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, వారి ప్రతిభను కేవలం మార్కుల ఆధారంగా అంచనా వేయలేమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలని, వారికి అండగా నిలబడాలని సూచించారు. ఫలితాల అనంతరం మానసిక ఆందోళనతో ఉన్న విద్యార్థులు టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 891 4416 కు కాల్ చేయవచ్చని అన్నారు. కాగా, మార్చి 5 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు.



## ఏపీ నుండి స్మృతి ఇరానీ?

రాజ్యసభకు ఎంపిక చేసే ఛాన్స్

**విజయసాయి ఖాళీలోకి బీజేపీ ఛాయిస్**

**హైదరాబాద్, మహా:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో రాజ్యసభ పోటీ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే.. ప్రస్తుతం ఉన్న బలాబలాల దృష్ట్యా ఈ సీటు కూటమికే దక్కే ఛాన్స్ ఉంది. దీంతో కూటమి నుంచి ఈ సీటు కోసం ఎవరు బరిలో ఉంటారు అన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. బీజేపీకి ఈ సీటును ఇచ్చేందుకు కూటమిలో ప్రధాన పార్టీలు అయిన టీడీపీ, జనసేన అంగీకరించాయి. తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలై పేరు వినిపించినా మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీని ఎంపిక చేయాలని బిజెపి డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. గతంలో రాహుల్ గాంధీని ఓడించిన స్మృతి ఇరానీ తర్వాత అదే స్థానంలో ఓడిపోయారు. దీంతో ఇపుడు రాజ్యసభ కు ఎంపికచేయాలని బిజెపి భావిస్తోంది.

# భూభారతి రైతులకు శ్రీరామరక్ష

ప్రజల సూచనలతో అవసరమైతే భూభారతిలో మార్పులు

రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించి ప్రజల నుంచి వచ్చే సూచనలు సలహాలను పరిగణనలోకి తీసుకొని అవసరమైతే మార్పులు చేస్తామని, ఈ చట్టాన్ని భూయజమానులకు మరింత చేరువ చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ప్రజల మీద ఈ చట్టాన్నిబలవంతంగా రుద్దబోమని వారి సూచనల మేరకు ఆమోదయోగ్యంగా తీర్చిదిద్దుతామని అందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూభారతి 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ చట్టం చేసేముందు రైతుల కష్టం గురించి ఆలోచించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ సూచనలను పరిగణన లోకి తీసుకొని రైతులుకు శ్రీరామ రక్షలా నిలిచే భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామని తెలిపారు. గతంలో నాలుగు గోడల మధ్య స్వార్ధపూరితంగా తయారుచేసిన ధరణి చట్టానికి మూడేళ్లు గడిచినా నియమనిబంధనలు రూపొందించలేదు. నాడు దొరవారి నోటి నుంచి వచ్చే మాటలే నియమాలు, నిబంధనలుగా చలామణి అయ్యాయి. ఫలితంగా ప్రజలకు కష్టాలు తప్పలేదు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో తొలివిడత ప్రయోగాత్మకంగా అమలు చేసి అన్ని వివరాలు, దరఖాస్తులు సేకరిస్తాం. జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరించి , అర్హులైన వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలుగా అందజేస్తాం. భూయజమానులకు న్యాయం జరిగేలా తహశీల్దార్ మొదలు కొని సిసిఎల్ఎ వరకు ఐదంచెల వ్యవస్దను అందుబాటులోకి తెస్తున్నాం. సిసిఎల్ఎ వద్ద కూడా న్యాయం జరగలేదని భావిస్తే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తాం. అంతేకాకుండా మీ ఫిర్యాదులను అవసరమైతే ఇంటినుంచి అధికారులకు పంపేలా పోర్టల్‌లో అవకాశం ఉంది. ఫిర్యాదులపై రెవెన్యూ శాఖ కార్యదర్శికి, మంత్రిగా నాకు కనిపించేలా పోర్టల్‌ను రూపొందించాం. రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీకల్లా రెవెన్యూ , గ్రామపరిపాలనాధికారులు మీకు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. తప్పుచేసే అధికారులపై చర్యలకు వెనుకాడబోం. గతంలో రైతు బందు కోసం గులాబీ రంగు కార్యకర్తలకు భూమి లేకపోయినా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. సక్రమంకాని అటువంటి అక్రమాలపై చర్యలు తప్పవు. రైతులకు మరిన్ని సేవలు అందేలా రెవెన్యూ వ్యవస్ద పనిచేయాలని ఏ పార్టీ కార్యకర్త అనే పక్షపాతం లేకుండా ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు చట్టం ఒక చుట్టంలా ఉపయోగపడేలా చూడాలని మంత్రి పొంగులేటి కోరారు.

## తెలంగాణ రాష్ట్రంలో రైతు బిడ్డకు టాప్ ర్యాంక్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పోచారం గ్రామానికి చెందిన రైతుబిడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ మొదటి విద్యా సంవత్సరంలో ప్రధమంగా నిలిచింది. ఇబ్రహీంపట్నం మండలం పోచారానికి చెందిన నగేశ్ గౌడ్ సబిత దంపతుల కుమార్తె శ్రీవార్షిక, ఎంపీసీలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించింది. అన్ని సబ్జెక్టుల్లో పూర్తి మార్కులు సాధించి, ఇంటర్ మొదటి సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రధమ ర్యాంకర్గా రైతు బిడ్డ నిలవడం గర్వకారణం. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఆ అమ్మాయికి అభినందనలు తెలియజేశారు.

## గద్దర్ అవార్డులు గ్రేట్



(మొదటిపేజీ తరువాయి)

అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్, ప్రముఖ సినీనటి జయసుధ అన్నారు. మంగళవారం ఎఎన్ఎన్ మహా తో ప్రత్యేకంగా మాట్లాడారు. జ్యూరీ ఛైర్మన్ గా తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి వెంకట్ రెడ్డి, దిల్ రాజులకు ధన్యవాదాలు తెలిపారు. అవార్డుల కోసం ఎంట్రీలు భారీగా వచ్చాయని, అన్ని సినిమాలు బాగానే ఉంటాయన్నారు. అన్ని రకాలు ఎంట్రీలు 1172 వచ్చాయని, వీటికి వేర్వేరు కమిటీలు దిల్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. తాను 76 సినిమాలు చూస్తానని, నెలరోజుల్లో ఇవి పూర్తిచేస్తామన్నారు. జ్యూరీలో ఎంతోమంది అనుభవజ్ఞులు, మంచి వారిని, గొప్ప వారిని పెట్టారన్నారు. సినిమా పండుగ అద్భుతంగా జరుగుతుందని భావిస్తున్నానన్నారు.



మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన

## పంచాయతీ రాజ్ ఉద్యోగులు

గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు విడుదల పట్ల హర్షం

**ములుగు, మహా :** గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు విడుదల చేసినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ పంచాయతీ రాజ్ ఉద్యోగులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖా మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు విడుదల చేయడం పై జీపీలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ నాయకులు మంత్రి సీతక్కను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్బంగా తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పత్తిరి శ్రీధర్, ములుగు జిల్లా అధ్యక్షుడు పెంట రఘులు మాట్లాడుతూ గతంలో జీతభత్యాలను గ్రామపంచాయతీ నిధుల నుండి ఎస్టివో ద్వారా మంజూరు చేయడం జరిగేదని, దీంతో జీతాలు సిబ్బందికి చేరడానికి నెలల సమయం వేచి చూడాల్సి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్ణయం మేరకు ప్రతీ నెల సిబ్బంది జీతాలు బ్యాంకు అకౌంట్ లో గ్రీన్ ఛానల్ ద్వారా జమ చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో సిబ్బంది ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మరింత ఉత్సాహం తో పని చేస్తారని మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మల్టీ పర్పస్ వర్కర్ లు, కారోబార్ లు పాల్గొన్నారు.

## హైడ్రాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జై

ప్రశంసిస్తూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం లేఖ

కూకట్‌పల్లి నల్ల చెరువును పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడంపై హర్షం

ప్లాట్లు ఉన్న వారికి నష్టపరిహారం చెల్లించాలని వినతి

**హైదరాబాద్, మహా:** హైడ్రాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జై కొట్టారు. నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా చేస్తున్న కృషిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. తన నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి నల్ల చెరువును పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో మిగిలిన చెరువులను కూడా అభివృద్ధి చేయాలని మంగళవారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌తో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారిని కలిసి వినతి పత్రం అందించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న భూ యజమానులతో పాటు ప్లాట్లు ఉన్నవారికి టీడీఆర్ కింద తగిన నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. నకిలీలకు ఆస్కారం లేకుండా అసలు లబ్ధిదారులను గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

**నాలాలను డైవర్ట్ చేయండి..**

అభివృద్ధి చేసిన చెరువుల్లో మురుగు నీరు కలవకుండా నాలాలను డైవర్ట్ చేయాలని సూచించారు. కబ్జాలకు పాల్పడిన వారు ఎవరైనా.. పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐడీఎల్ చెరువు, బోయిన చెరువును, ములకత్వ చెరువు నల్ల చెరువులో కొంత భాగం సుందరీకరణ చేశామన్నారు. కోర్టు కేసులుండడంతో పనులు పూర్తి చేయలేకపోయామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పారు. అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి నష్టపరిహారం అందేలా చూస్తామని.. అలాగే నగరంలోని అన్ని చెరువుల అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు.

## హైదరాబాద్ మెట్రో రైళ్లలో బెట్టింగ్ యాప్స్ ప్రచారం

హైకోర్టులో మెట్రో సంస్థపై పిల్ దాఖలు.. న్యాయవాది నాగూర్‌బాబు పిటిషన్

ప్రతివాదులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఈడీలను చేర్చిన న్యాయవాది

**మహా :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల సెగ తాజాగా హైదరాబాద్ మెట్రో రైలు సంస్థను కూడా తాకింది. మెట్రో రైళ్లలోనూ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన ప్రచారాలు నిర్వహించారంటూ ఆరోపిస్తూ తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. న్యాయవాది నాగూర్‌బాబు ఈ పిల్‌ను దాఖలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థగా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన మెట్రో రైలు సంస్థ, చట్టవిరుద్ధమైన బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడంపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) సహా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని కూడా ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. బెట్టింగ్ యాప్‌ల బారిన పడి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది యువత ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్రత సంతరించుకుంది. ఇప్పటికే ఈ కేసులో భాగంగా పలువురు సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, యూట్యూబర్‌లపై పోలీసులు కేసులు నమోదు చేసి, కొందరికి నోటీసులు జారీ చేయగా, మరికొందరిని విచారించిన విషయం తెలిసిందే. తాజాగా మెట్రో రైలు సంస్థపై పిల్ దాఖలు కావడం గమనార్హం.

# సివిల్స్‌లో తెలంగాణ సత్తా

**కానిస్టేబుల్ కొడుకు కలెక్టర్ అయ్యిండు**

**ఆదిలాబాద్, వరంగల్, మహా:** యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ పరీక్షల లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. కానిస్టేబుల్ కొడుకు కలెక్టర్ ఉద్యోగానికి ఎంపిక కావడంపట్ల రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ కొడుకు సివిల్స్ కు ఎంపిక కావడంతో జిల్లా వ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు చెందిన హేడ్ కానిస్టేబుల్ జాదవ్ గోవింద్ కొడుకు చైతన్య జాదవ్ సివిల్స్ లో 68 ర్యాంక్ సాధించాడు. దీంతో ఊట్నూరులో ఆనందోత్సవాలు మొదలయ్యాయి. తండ్రి కానిస్టేబుల్ అయినప్పటికీ కొడుకు కష్టపడి కలెక్టర్ కు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. సాధారణ కానిస్టేబుల్ కొడుకు కలెక్టర్ కావడం గర్వకారణం అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




**వరంగల్‌కు చెందిన సాయిశివాణికి 11వ ర్యాంక్**

యూపీఎస్సీ ఫలితాల్లో వరంగల్ కు చెందిన ఇట్టబోయిన సాయిశివాణి జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ తో సత్తా చాటింది. వరంగల్ నగరంలోని ఇట్టబోయిన రాజ్‌కుమార్, రజితల ప్రథమ పుత్రిక ఇట్టబోయిన సాయిశివాణి జాతీయస్థాయిలో టాప్ 20 ర్యాంకు సాధించి గర్వకారణంగా నిలిచింది. జాతీయ స్థాయి ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్ల శ్రమకు తగిన ఫలితం దక్కిందని, తమ కూతురు కలెక్టర్ కాబోతుందంటూ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రిటైరైనా వదిలేది లేదు

లగచర్ల బాధితులను కొంతమంది పోలీసులు వేధిస్తున్నారని తెలిసింది : కేటీఆర్

మూడేళ్లలో అధికారంలోకి వచ్చి చర్యలు తీసుకుంటాం

సీఎం క్షమాపణ చెప్పాలి, పోలీసులను తొలగించాలని డిమాండ్

చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టుకు వెళతాం



**మహా :** లగచర్ల బాధితులను ఇంకా కొందరు పోలీసులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారుల పేర్లను రాసిపెట్టుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అతిగా ప్రవర్తించిన అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నా వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, లగచర్ల భూసేకరణ వివాదంలో మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తాము జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ మహిళా కమిషన్‌లను ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా తప్పుబట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. మానవ హక్కుల కమిషన్ నివేదిక తర్వాత అయినా రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ సూచించిన విధంగా ఆరు వారాల్లోగా చర్యలు తీసుకోకుంటే రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి పాత్ర ఉందని భావించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. లగచర్లలో భూసేకరణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కేటీఆర్ అన్నారు. దీనిని వెంటనే నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అమెరికా- భారత్ భాగస్వామ్యం వృద్ధే ట్రంప్ ఆకాంక్ష

యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. భారత్‌పై పొగడ్తల వర్షం

**మహా :** అమెరికాతో పాటు భారత్ కూడా అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. అమెరికా, భారత్ భాగస్వామ్యం వృద్ధి చెందాలన్నదే ట్రంప్ ఆకాంక్ష అని చెప్పారు. భారత్ పర్యటనలో ఉన్న వాన్స్ రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. భారత శిల్పకళా నైపుణ్యం తనను అబ్బురపరిచిందన్నారు. భారత్ చరిత్ర, సంప్రదాయాలతో సుసంపన్నమైందని, భవిష్యత్తు పట్ల భారత్ దార్శనికత మెచ్చుకోదగినదని కొనియాడారు. అభివృద్ధి చెందేందుకు భారత్‌లో ఎన్నో అవకాశాలున్న జేడీ వాన్స్, భారతీయులమని ఇక్కడి వారు సగర్వంగా చెప్పుకుంటారన్నారు. ఏదో సాధించాలనే తపన భారతీయుల్లో అధికం అని చెప్పారు.

**భారత్ మా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి**

భారతదేశం తన మార్కెట్లలో అమెరికాకు యాక్సెస్ ఇవ్వాలని వాన్స్ పిలుపునిచ్చారు. అంతేకాకుండా అమెరికా ఇంధనం, రక్షణ హార్డ్‌వేర్‌లను కొనుగోలు చేయాలని చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ, రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల్లో అమెరికా, భారత్ కలిసి సాధించాల్సినవి చాలా ఉన్నాయన్నారు. 21వ శతాబ్దపు భవిష్యత్తును భారత్, అమెరికాల బలం నిర్ణయిస్తుందని చెప్పారు. దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు న్యాయంగా ఉండాలన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ వంటి స్నేహితులతో కలిసి మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేలా ప్రపంచ వాణిజ్యాన్ని తిరిగి సమతుల్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కొనియాడిన జేడీ వాన్స్ మోదీ పొందిన అప్రూవల్ రేటింగ్స్ వల్ల తనకు అసూయ కలిగిందని గత రాత్రి ఆయనతో చెప్పినట్లు వెల్లడించారు.

# సీసీటీఎన్ఎస్ పై దృష్టి పెట్టండి


వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ జితేందర్

**మహా :** క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్ వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) లో వస్తున్న అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. డీజీపీ కార్యాలయంలో మంగళవారం అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టుపై డీజీపీ చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న నేరస్తులను కనిపెట్టేందుకు ఈ ప్రాజెక్టులో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారని వాటిపై పరిణతి సాధించాలని డీజీపీ సూచించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టు ను సమర్థవంతంగా ఉపయోగించాలని తద్వారా క్రింది స్థాయి సిబ్బంది మరింత మెరుగ్గా వినియోగించగలుగుతారన్నారు. ప్రాజెక్టులో భాగంగా ఈ సమన్స్, ఈ సాక్ష్య వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలన్నారు. సీసీటీఎన్ఎస్ డేటా, సమాచారం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఐసీజేఎస్ పథకం కింద కంప్యూటర్లను, వాటి అనుసంధానమైన పరికరాలను భారీ స్థాయిలో పంపిణీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ పోలీస్ శాఖకు దేశంలోనే పేరు ఉందని తెలిపారు. ఉత్తమ పోలీస్ స్టేషన్ ల ఎంపిక, గుర్తింపు ఈ ప్రాజెక్టు ద్వారా జరుగుతుంది కాబట్టి దీనిని విస్తృతంగా వినియోగించుకోవాలని, క్రింది స్థాయి ఉద్యోగులు కూడా పకడ్బందీగా వినియోగించుకునేలా పర్యవేక్షణ చేయాలని ఎస్పీలకు, కమిషనర్లకు ఆదేశించారు. .ప్రాజెక్టును సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా కిందిస్థాయి సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని డీజీపీ సూచించారు.టెక్నికల్ సర్వీసెస్ అడిషనల్ డీజీపీ వివి శ్రీనివాస్ రావు, శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేష్ ఎం భగవత్, శాంతి భద్రతల డీసీపీలు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలకు

# సర్వం సిద్ధం

### రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి



**మహా :** హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి మీడియాతో మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని, రేపు 23న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్ లో పెట్టామని చెప్పారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సుమారు 200 నుండి 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు మినహా జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పనిచేసే మిగతా ఉద్యోగులకు 23న సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. అట్టి ఉద్యోగులందరూ జూన్ నెల రెండో శనివారం 14వ తేదీన కార్యాలయ విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.






# జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి





## 27 మంది పర్యాటకుల దుర్మరణం

మరో 20మందికి తీవ్ర గాయాలు.. పెరుగుతున్న మృతుల సంఖ్య

- విహారానికి వచ్చిన వారిపై విరుచుకుపడ్డ ఉగ్రమూకా
- హైదరాబాద్ కు చెందిన ఐబి ఆఫీసర్ సహా గుజరాత్, తమిళనాడు, ఒడిస్సాకు చెందిన పలువురు మృతి
- దాడి సమాచారం అందిన వెంటనే స్పందించిన మోదీ.. అమిత్ షాకు ఫోన్
- హుటాహుటిన కాశ్మీర్ కు హోంమంత్రి.. దుర్ఘటనను ఖండించిన రాహుల్ గాంధీ, రేవంత్, ఒవైసీ

**మహా:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదే. దాడి సమాచారం అందిన వెంటనే ప్రధాని నరేంద్రమోదీ హోంమంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి వెంటనే కాశ్మీర్ బయలుదేరి వెళ్ళాలని ఆదేశించారు. మరోవైపు దాడి నేపథ్యంలో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యాటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**ఉగ్రదాడిలో హైదరాబాద్ ఐబి ఆఫీసర్ మృతి**

ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిలో ఇప్పటి వరకు దాదాపు 30 మంది టూరిస్టులు మరణించగా.. మరో 20 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. తాజా సమాచారం ప్రకారం మృతుల్లో ఒకరిని తెలంగాణవాసిగా గుర్తించారు. హైదరాబాద్ కు చెందిన మనీష్ రంజన్ జమ్ము కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిలో మరణించినట్టు అధికారులు పేర్కొన్నారు. మనీష్ రంజన్ నగరంలో ఇంటలిజెన్స్ బ్యూరో అధికారిగా విధులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా మృతి భార్య, ఇద్దరు పిల్లలు మాత్రం ఈ దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డట్టు అధికారులు పేర్కొన్నారు.

**అమర్‌నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. ఉగ్రదాడి దేశవ్యాప్తంగా సంచలమైంది.

### అమిత్‌షాకు మోదీ ఫోన్.. అత్యున్నత స్థాయి సమావేశం

పవల్గాం ఉగ్రదాడిపై సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్రం హోం మంత్రి అమిత్‌షాకు ఫోను చేశారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఘటనా స్థలికి వెళ్లాలని అమిత్‌షాను ఆదేశించారు. కాగా, పరిస్థితిని సమీక్షించేందుకు అధికారులతో అత్యన్నత స్థాయి సమావేశాన్ని అమిత్‌షా ఏర్పాటు చేశారు. హోం సెక్రటరీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, హోం శాఖ సీనియర్ అధికారులు, జమ్మూకశ్మీర్ డీజీపీ సహా ఇతర అధికారులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.

### తీవ్రంగా ఖండించిన రాహుల్, ఒమర్ అబ్దుల్లా

ఉగ్రవాదులు జరిగిన దాడి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. "ఈ ఘటనను ఖండించడానికి మాటలు కూడా చాలవు. మన అతిథులపై జంతువుల్లా, అమానవీయంగా జరిపిన దాడి ఇది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నాం. శ్రీనగర్‌కు తక్షణం బయలుదేరి వెళ్తున్నాను" అని ఒమర్ ట్వీట్ చేశారు. మరోవైపు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ సంఘటనపై స్పందించారు. ఇలాంటి ఘటన వైఫల్యానికి అద్దం పడుతోందని, ఇలాంటివి రిపీట్ కాకుండా కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జమ్ముకాశ్మీర్ ఉగ్రదాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## చంపింది మేమే..

టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ ప్రకటన



**శ్రీనగర్:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్, బైసరీన్ వ్యాలీలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడిన సంగతి తెలిసిందే. అత్యంత సమీపం నుంచి ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఏడుగురు టెర్రరిస్టులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడిన వారిని మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. ఇక, టూరిస్టులపై కాల్పులు జరిపింది తామేనని టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది.

**ముస్లిం కాదన్నాడు.. చంపేశారు..**

ఉగ్రవాదులు పర్యాటకులపై దాడికి పాల్పడ్డానికి ముందు ముస్లింలా కాదా అన్న సంగతి తెలుసుకుని మరీ కాల్పులకు తెగబడ్డారు. ఓ వ్యక్తిని చంపే ముందు 'నువ్వు ముస్లింవా' అని అడిగారు. అతడు కాదని చెప్పడంతో కాల్చి చంపేశారు. అతడి భార్య ఈ విషయాన్ని చెప్పుకొచ్చింది. ' నేను సైడుకు కూర్చుని భేల్ పూరి తింటూ ఉన్నాను. నా భర్త పక్కనే ఉన్నాడు. ఓ వ్యక్తి నా భర్త దగ్గరకు వచ్చాడు. 'నువ్వు ముస్లింవా' అని అడిగాడు. నా భర్త కాదని చెప్పాడు. అంతే కాల్చి చంపాడు' అంటూ కన్నీరు మున్నీరు అయింది. ఓ మహిళ తన భర్త శవం దగ్గర కూర్చుని ఏడుస్తున్న ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# క్షమించరాని ఘటన

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రాహుల్, సీఎం రేవంత్ సహా దేశం దిగ్భ్రాంతి

వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు.

**వారిని వదిలిపెట్టం: ప్రధాని మోదీ**

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యంత హేయమైన ఈ చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని..వారిని వదిలిపెట్టబోమన్నారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం దృఢమైనదన్న ప్రధాని.. అది మరింతగా బలపడుతుందని స్పష్టంచేశారు.

**దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: సీఎం రేవంత్ రెడ్డి**

ఉగ్రదాడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ముష్కరుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇలాంటి దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని తెలిపారు. ఉగ్రవాద మూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలియజేశారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**ఉగ్రదాడుల కారకుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: కిషన్‌రెడ్డి**

జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి ఘటన పట్ల కలతచెందినట్లు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ''మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జాతి మొత్తం ఏకతాటిపై ఉంటుంది. అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య'' అన్నారు.

### ఒక్కరిని కూడా వదిలిపెట్టం

**ఉగ్రదాడిపై కేంద్రమంత్రి బండి సంజయ్ రియాక్షన్**

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ''జమ్మూ& కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. చాలా బాధించింది. బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇటువంటి పిరికిపంద చర్యలు మా దృఢ సంకల్పాన్ని విచ్ఛిన్నం చేయవు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం, హోంశాఖ మంత్రి అమిత్ షా దృఢ నాయకత్వంలో, పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. ఈ చర్య వెనుక ఉన్న వారిని ప్రభుత్వం వదిలిపెట్టదు. నేరస్థులు అత్యంత కఠినమైన పరిణామాలను ఎదుర్కొంటారు' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

**జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిపై స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ**

జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిని ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. ఆర్మీ దుస్తుల్లో వచ్చి అమాయకులను చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. టూరిస్టులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.











# జోరు మీదున్న కొండపల్లి శ్రీనన్న

## విజయనగరంలో యంగ్ మినిస్టర్ దూకుడు

### చంద్రన్న దారిలో లోకేష్ బాటలో.. ఏడాదిలోనే అద్వితీయ పట్టు

### ఎంఎస్ఎంఈ ఎన్ఆర్ఐ మంత్రిగా బాధ్యతలు

### జిల్లా మంత్రిగా అధికారయంత్రాంగానికి దిశాదశ


**విశాఖపట్టణం, మహా:** ఉత్తరాంధ్రలో.. ఉత్తమ మంత్రి ఎవరంటే అందరూ ఠక్కున చెప్పే పేరు కొండపల్లి శ్రీనివాస్. నిజాయితీకి, నిబద్ధతకు ఆయన మారుపేరు. అరంగేట్రంలోనే డబుల్ ధమాకా సాధించాడంటే ఆయన కమిట్ మెంట్.. ఆయనలోని లోతు, ఆయన సామర్థ్యం అర్థమవుతోంది. భవిష్యత్తును అందరి కంటే ముందు ఊహించే దార్శనికుడు, భారతదేశ రాజకీయాల్లోనే అపర చాణక్యుడు, మహానాయకుడు చంద్రబాబే కొండపల్లి శ్రీనివాస్ ను మొదటిసారి గెలవగానే తన మంత్రివర్గంలోకి తీసుకున్నాడంటే ఆయనపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పార్టీ యువసారధి లోకేష్ కు ఉన్న నమ్మకం స్పష్టమవుతోంది. రాజకీయాల్లో చాలా మంది మాటలు చెబుతారు. కానీ గజపతినగరం నుండి నాలుగుమాసాల్లోనే బొత్స కుటుంబ కోటను కూల్చి విజయం సాధించి.. పసుపుజెండాను రెపరెపలాడించి లోకేష్ విశ్వాసాన్ని నిలుపుకున్న నాయకుడు కొండపల్లి శ్రీనివాస్. చంద్రబాబు, లోకేష్ ఆషామాషీగా అవకాశాలు ఇవ్వరు. కొండపల్లి శ్రీనివాస్ కమిట్ మెంట్, ఏదైనా బాధ్యత ఇస్తే దానిని విజయవంతం చేసేందుకు ఎందాకైనా ఎంతదూరమైనా , ఎంతకష్టమైనా ప్రయత్నించి ఫలితం చూపడం వల్లే ఆయనకు అవకాశాలు దక్కాయి. ఇక చంద్రబాబు ఏఐ కంటే వేగంగా అంచనా వేసే దార్శనికత కలిగిన లీడర్. అలాంటి లీడర్ ఏడాదిగా పనితీరును పరిశీలించి.. ఉత్తరాంధ్రలోనే నెంబర్ వన్ మినిస్టర్ గా, రాష్ట్రంలో మూడోస్థానంలో ఉన్న మంత్రిగా ర్యాంక్ ఇచ్చాడంటే కొండపల్లి శ్రీనివాస్ పనితీరు అర్థం చేసుకోవొచ్చు. హేమాహేమీలున్న విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబ ప్రాభవానికి చెక్ పెట్టి.. ఏడాదిలోనే జిల్లాపై పట్టు బిగించిన కొండపల్లి శ్రీనివాస్ పై ప్రజలు కొండంత అభిమానం పెంచుకున్నారు.

### పైకి సాఫ్ట్.. పనితీరులో డైనమిక్

కొండపల్లి శ్రీనివాస్ పైకి సాఫ్ట్ గా కనిపిస్తారు. పనితీరుతో, పట్టుదలతో ఫలితాలను సాధిస్తారు. ఆయనకు చినబాబు బాధ్యత అప్పగిస్తే చాలు.. రాత్రి పగలు తేడా ఉండదు. వందశాతం ఫలితాలు చూపిస్తాడు. పని ఎక్కువ చేసి.. ప్రచారం తక్కువ పొందే మంత్రుల్లో కొండపల్లి శ్రీనివాస్ ముందువరుసలో ఉంటారు. అభిమానులు శ్రీనన్న అని ప్రేమగా పిలుచుకుంటారు. రాత్రి పగలు కష్టపడి ఆయనకు అప్పజెప్పిన బాధ్యతలను నూటికి నూరుశాతం నిర్వర్తిస్తూ.. విజయవాడకి ,విజయనగరం కి మధ్య కాళ్లకు చక్రాలు కట్టుకొని పరిగెడుతున్న మంత్రిగా శ్రీనివాస్ కు పేరుంది. ఆయన ఆపితే ఆగే రకం కాదు.. ముందుకు దూసుకుపోయే రకం అని అభిమానులు గర్వంగా కాలరెగరేసి చెబుతుంటారు. పార్టీ సభ్వత్వనమోదులోనూ గజపతినగరం నియోజకవర్గం ఉత్తరాంధ్ర రికార్డు. 70వేల సభ్యత్వాలు పూర్తిచేసి.. బాబు ఆదేశిస్తే చాలు జరిగితీరవల్సిందే అంటూ పలితం చూపడంలో ఆయన దిట్ట విజయనగరం జిల్లా రాజకీయ గమనాన్ని మార్చే దిశగా కొత్త మంత్రి దూసుకెళ్తున్నారు. జిల్లా యంత్రాంగాన్ని సమీక్షలతో, కార్యాచరణతో కట్టుదిట్టంగా కంట్రోల్‌లోకి తీసుకొస్తున్నారు. అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షలు, స్పష్టమైన టార్గెట్లు, పారదర్శక వ్యవస్థలు ఏర్పాటు చేస్తూ, ప్రజల్లో మద్దతును కూడగట్టుకుంటున్నారు.

## ఇన్నాళ్ళూ ఒక లెక్క.. ఇపుడో లెక్క

చంద్రబాబు ఆదేశాలు, చినబాబు ప్రోత్సాహంతో కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలో జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్నాడు. ఒకప్పుడు బొత్స ఫ్యామిలీకి పెట్టనికోటగా ఉన్న విజయనగరం జిల్లాను ఇపుడు పసుపుతోటగా మార్చడంలో కొండపల్లి నిరంతరం పనిచేస్తున్నాడు. కొండపల్లి రాజకీయ చాణక్యంతో బొత్స ఫ్యామిలీ క్రమంగా విజయనగరం వదిలి విశాఖ పై దృష్టి సారించింది. ఇన్నాళ్ళూ ఒక లెక్క.. ఇపుడు మరో లెక్క అంటూ సరికొత్త రాజకీయాలపై జిల్లా రాజకీయనేతలు విశ్లేషించుకుంటున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండడం, డైనమిక్ సీఎం చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న రాష్ట్ర ప్రగతిని ప్రజల ముందుంచడం, మంచి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్ళడం లక్ష్యాలుగా కొండపల్లి పనిచేస్తున్నారు. కొత్త తరహా రాజకీయానికి కొండపల్లి కేరాఫ్ గా నిలుస్తున్నారు. ప్రజలు గుండెల్లో పెట్టుకోవాలంటే మంచి చేయాలని, దౌర్జన్యాలు.. బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లిందని చెబుతారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, బొత్స వెనుకపడేసిన జిల్లాను ముందువరుసలోకి తీసుకెళ్ళే బాధ్యత తాను తీసుకుంటానని చెబుతారు.







# నేడే హైదరాబాద్ ఎమ్మెల్సీ ఫైట్

## ఎంఐఎం, బీజేపీ మధ్య పోటీ.. పోలింగ్ కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఓ మైక్రో అబ్జర్వర్‌తో పాటు ఓ కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులతో ఓ బృందాన్ని నియమించారు. బ్యాలెట్ పద్ధతిలో జరగనున్న ఈ పోలింగ్‌కు ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం ఒక పోలింగ్ కేంద్రం, కార్పొరేటర్లకు మరో కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నిక కోసం 250 మంది పోలీసుల బందోబస్తుతో పాటు మొత్తం 500 మంది సిబ్బంది ఎన్నిక విధుల్లో ఉండనున్నారు. అయితే ఈ ఎన్నికల్లో నోటా ఆప్షన్ ఉండదని విప్ కూడా ఉండదని ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు వేయవద్దంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఎన్నికల కమిషన్‌కూ నివేదిక పంపించినట్లు వివరించారు.




**ఎన్నిక అనివార్యం :**

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఎంఐఎం, బీజేపీ అభ్యర్థులు పోటీపడుతున్నారు. బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ గౌతంరావు, ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఓటింగ్‌లో సైతం పాల్గొనబోమని ప్రకటించింది. దీంతో ఎంఐఎం, బీజేపీ మధ్య పోటీ ఉండనుంది. మే 1న ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీకాలం ముగియనుండటంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే ఈ సారి కూడా ఈ స్థానం ఏకగ్రీవం అవుతుందని భావించినప్పటికీ అనూహ్యంగా బీజేపీ రంగంలోకి దిగడంతో ఎన్నిక అనివార్యమైంది.

**ఈ నెల 25న ఓట్ల లెక్కింపు**

అత్యధిక ఓట్లు ఎంఐఎంకు ఉండగా తర్వాత స్థానంలో బీజేపీ ఉంది. 40 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి ఎంఐఎంకు మొత్తం 49 మంది ఓట్లు ఉండగా బీజేపీకి 19 మంది కార్పొరేటర్లు, ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి మొత్తం 25 ఓట్లు ఉన్నాయి. సంఖ్యా బలం లేకున్నా గెలుపోటముల తో సంబంధం లేకుండా పోటీ చేయడమే లక్ష్యమని బీజేపీ ప్రకటించింది. గెలుస్తామనే ధీమాతోనూ ఉంది. అటు పోటీకి దూరంగా ఉన్న కాంగ్రెస్‌కు ఏడుగురు కార్పొరేటర్లు, ఏడుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతో మొత్తం 14 ఓట్లు ఉన్నాయి. బీఆర్ఎస్కు 15 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 24 ఓట్లు ఉన్నాయి. ఎన్నికలో ఎంఐఎంకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మజ్లిస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా ఈ నెల 25న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# ఆపరేషన్ కర్రెగుట్ట

### మావోయిస్టులను చుట్టుముట్టిన భద్రతాబలగాలు

### భీకర యుద్ధం!



**మహా:** తెలంగాణ గడ్డపై మావోయిస్టులు, భద్రతాబలగాలకు మధ్య భీకర పోరు జరగనుంది. ములుగు జిల్లా కర్రెగుట్టను పోలీసులు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గుట్టచుట్టూ బాంబులు పెట్టినట్లు మావోయిస్టులు ప్రకటించగా ఏం జరగబోతుందనేది ఉత్కంఠరేపుతోంది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా దళం ములుగు జిల్లా కర్రెగుట్టల్లో సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు కర్రెగుట్ట పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టాయి. వెంకటాపురం మండల పరిధిలో ఉన్నతాధికారులు భారీగా సాయుధ బలగాలను మోహరించారు. వెయ్యి మందికిపైగా సాయుధ బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. దీంతో ములుగు జిల్లా పరిసరప్రాంతాల్లో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. మరోవైపు మారణహోమం వద్దని, మావోయిస్టులు చర్చలకు సిద్ధమని చెప్పాక దాడులు చేసి చంపడం సరికాదని ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు ప్రకటనలు విడుదల చేశారు. అయితే కర్రెగుట్టల్లో ఏం జరుగుతున్నదనేది బయటి ప్రపంచానికి తెలియదు. కానీ ములుగు ఏజెన్సీలో భయానక వాతావరణం నెలకొంది.

## మేమున్నాము అంటూ స్నేహితుడికి చేయూత



**మేళ్లచెరువు,మహా:** మేళ్లచెరువు మండల కేంద్రంలో పిక్కిలి కృష్ణ గత కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్ కి వెళ్ళగా అతనికి ఒక కాలు తీసివేయడం జరిగింది. ఆర్థిక పరిస్థితుల్లో కొట్టు మెట్టాడుతున్న తరుణంలో ఎటు వెళ్లలేక ఏ పని చేయలేక ఇంట్లో కూర్చొని బాధపడుతున్న అతనికి మేమున్నాము అంటూ ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులు వారి తోటి స్నేహితుడికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి మనసు చెల్లించిన స్నేహితులు నవ భారతి స్కూల్ 2000 2001 బ్యాచ్ కి సంబంధించి తోటి స్నేహితులు అందరూ కలిసి ఆ స్నేహితుడికి చేయూతనిచ్చారు. అతనికి మనోధైర్యం నిచ్చి గుండెల నిండా ధైర్యాన్ని నింపి స్నేహితులు అంటే స్వార్థానికి వదిలేసేవారు కాదని కష్టాలలో కూడా పాలుపంచుకోగలం అనే విధంగా ఆర్థిక సాయం 52,000 నగదు అందించారు, అంతేకాకుండా పిక్కిలి కృష్ణ కుటుంబానికి ఒక నెలకు సరిపడా 50 కేజీల బియ్యం 15 కేజీ ల నూనె డబ్బా కుటుంబానికి సరిపడ నిత్యవసర వస్తువులు అందించి స్నేహితుడికి అండగా నిలబడ్డారు .ఇట్టి కార్యక్రమంలో పిక్కిలి కృష్ణ స్నేహితులకు అభినందనలు తెలియజేశాడు.

### పార్టీ మనవడు కోసం కార్యకర్తలు

## శాయశక్తుల కృషి చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఒంటెద్దు నరసింహారెడ్డి



**హుజూర్ నగర్ ,మహా:** పార్టీ మనవడు కోసం కార్యకర్తలు శాయ శక్తుల కృషి చేయాలని హుజూర్నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మఠంపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య మండల సీనియర్ నాయకులు మన్నెం శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో మఠంపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హుజూర్నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఒంటెద్దు నరసింహారెడ్డి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మఠంపల్లి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ మనుగడకోసం శాయశక్తుల కృషిచేసి మళ్లీ కెసిఆర్ సారథ్యంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి పార్టీకి ఊపిరినందిస్తూ పార్టీకి వెన్నుదనుల నిలబడాలని సూచించారు. ఈనెల 27న కేసీఆర్ తలపెడుతున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రతి ఒక్క బిఆర్ఎస్ సైనికుడు కదిలి రావాలని పార్టీ శ్రేణులను ఈ సందర్భంగా కోరారు. ఇట్టి కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కమిటీల నాయకులు, సభ్యులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, మండల పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, ఆయా కమిటీల సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లి ఆలయంలో

## హైటెన్షన్ ఘట్టం

- కేశవాపురం యువకుల ఆత్మాహుతి యత్నం కలకలం
- పాలకమండలి ప్రమాణస్వీకార వేళ వాగ్వాదం, అరెస్టులు
- భట్టి- పొంగులేటి వర్గాల మధ్య మాటల యుద్ధం



**కొత్తగూడెం మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలతో పవిత్ర క్షేత్రం ఉద్విగ్నతకు కేంద్రంగా మారింది. ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమం నేపథ్యంలో స్థానిక రాజకీయ వర్గాలు—భట్టివిక్రమార్క మరియు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుల మధ్య వాగ్వాదం చెలరేగింది. పాలకమండలిలో తమ ఊరికి చోటు దక్కలేదని అభాగ్యంగా భావించిన కేశవాపురం గ్రామ యువకులు పెట్రోల్ పోసుకొని ఆత్మహుతికి యత్నించడమే కాకుండా ఆలయ ప్రాంగణంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అడ్డుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు భారీ బందోబస్తు కల్పించిన పోలీసులు చివరికి ప్రమాణస్వీకారాన్ని ముగింపుకు తీసుకెళ్లగలిగారు. ఈ సంఘటన స్థానిక రాజకీయాల ఉగ్ర స్వరూపాన్ని మళ్లీ బయటపెట్టింది.పాల్వంచ పట్టణంలోని ప్రసిద్ధ పెద్దమ్మతల్లి ఆలయంలో ఉదయం అత్యంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా, స్థానిక రాజకీయ నేతల వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వర్గీయుడు జమ్ముల రాజశేఖర్ ఆలయ పాలకమండలి చైర్మన్‌గా నియమించబడిన నేపథ్యంలో, పొంగులేటి వర్గీయులు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో, కేశవాపురం గ్రామస్తులు తమ గ్రామానికి పాలక మండలిలో ప్రాతినిధ్యం ఇవ్వలేదని తీవ్ర ఆవేదనకు లోనై, నిరసనలు తెలుపుతూ కొద్దిరోజులుగా ఉద్యమిస్తున్నారు. ఈ రోజు ఉదయం, పలువురు యువకులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వారిని నిరోధించేందుకు పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. ఆలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పేలా కనిపించడంతో పోలీసులు భారీగా బలగాలు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకొని ఆలయ పరిసరాలను ఖాళీ చేయించారు. చివరికి, ఈ ఉద్రిక్తతల నడుమ కూడా కొత్తగా నియమితులైన పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం నిర్వహించారు.

# హిరోషిమాలో జయజయహే తెలంగాణ

### ముగ్దుడైన ముఖ్యమంత్రి రేవంత్



**మహా :** జపాన్ దేశం హిరోషిమా నగరంలోని జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం వద్ద ఇద్దరు తెలుగు అమ్మాయిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎదుట తెలంగాణ అధికారిక గీతం 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం..' ఆలపించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , హిరోషిమా లెజిస్లేచర్ ప్రతినిధిలతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించడానికి వెళ్లిన సమయంలో హర్షిణి (8 వ తరగతి), హరిణి (7 వ తరగతి) వారి కుటుంబ సభ్యులతో కలిసొచ్చి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినులు ముఖ్యమంత్రి గారికి స్వాగతం పలుకుతూ రేవంత్ రెడ్డి చిత్రాన్ని గీసిన పెన్సిల్ స్కెచ్ పెయింటింగ్స్ ను అందించారు. ఆ పెయింటింగ్స్ చూసి ఆనందం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ పిల్లలిద్దరూ గాంధీ విగ్రహం వద్ద జయ జయహే తెలంగాణ.. గీతాన్ని ఆలపించారు.



### తెలంగాణ కోసం ఇంద్రారెడ్డి

## సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి
- ఆరుట్లలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్రం కోసం సమాజ శ్రేయస్సు కోసం మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, గుండెమోని జయమ్మ అన్నారు. మంగళవారం ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మంచాల మండల మాజీ అధ్యక్షులు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలోని ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు ఇంద్రారెడ్డి విశేషమైన కృషి చేశారని, పేద ప్రజల ముద్దు బిడ్డగా.. బడుగు బలహీన వర్గాలకు బాసటగా.. నిస్సహాయులకు నీడగా, పేదలకు అండగా నిలిచిన ఇంద్రారెడ్డి పేదల గుండెల్లో చెరగని ముద్రగా నిలిచిపోయారని పేర్కొన్నారు .



### పేద ప్రజలకు ఉచిత మంచినీటి ఫిల్టర్ అందించిన విఆర్ వన్ ఫౌండేషన్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మంచాల మండలం, ఆంబోతు తండా గ్రామంలో వీఆర్ వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి వాటర్ ఫిల్టర్ ను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. పేద ప్రజల కోరకు ఉచిత మంచినీటి వాటర్ ఫిల్టర్ ను, వి ఆర్ ఫౌండేషన్ వారు అందించడం అభినందనీయమని, ఉచిత మంచినీటి ఫిల్టర్ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### మేడారం మహాజాతర 2026లో

## శాశ్వత పనులు చేపట్టాలి

### అన్ని శాఖల ఆఫీసర్లు సమన్వయంతో పనిచేయాలి

### రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క.. ములుగులో అధికారులతో సమీక్ష



**ములుగు, మహా :** వచ్చే ఏడాది ఫిబ్రవరి మాసంలో జరిగే మేడారం మహా జాతరకు తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులను ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి శాశ్వతంగా నిలిచేలా పనులు పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. మంగళవారం ములుగు కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకర టీఎస్ అధ్యక్షతన 2026లో జరగనున్న మేడారం మహ జాతరను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలుశాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టనున్న పనులను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో లాగా జాతరకు రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా పూర్తి చేయకుండా కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యతతో పనులు ముగించాలని సూచించారు. వచ్చే ఏడాది మేడారం సమ్మక్క సారలమ్మ మహ జాతర తో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుందని, రెండు పెద్ద పండుగలను పురస్కరించుకొని ఆయా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కుంభమేళా తరహాలో జరుగుతున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలని, గత మహ జాతర సందర్భంగా మిగిలిన రూ.50కోట్లను రానున్న మహా జాతరకు వినియోగిస్తామని స్పష్టం చేశారు.



### రాజ్యాంగం మన హక్కుల పరిరక్షణ కొరకు నిలువుటద్దం

**రంగారెడ్డి జిల్లా మహా:** శంషాబాద్ మండలం, పిల్లోనిగూడ, అచ్చంపేట్ గ్రామాలలో, మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ నర్సింహాతో కలసి ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ మన దేశ భవిష్యత్ కోసం మన నినాదమని అన్నారు. రాజ్యాంగం మన హక్కుల పరిరక్షణ కొరకు నిలువుటద్దమని, మన రాజ్యాంగం గురించి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెలలో పాదయాత్ర ద్వారా గ్రామ గ్రామాన పర్యటిస్తూ రాజ్యంగా విలువలని కాపాడేలా ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని శేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు.

## చేవెళ్ల నియోజకవర్గంలో పట్లోల్ల ఇంద్రారెడ్డి ఘననివాళులు

### ప్రత్యేక రాష్ట్రం కోసం మొట్టమొదటిగా పోరాడిన వ్యక్తి

### ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన ఇంద్రారెడ్డి

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కీర్తిశేషులు పట్లోల్ల ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలం చిలుకూరు, రెడ్డి పల్లి, మొయినాబాద్, చేవెళ్ల ఎక్స్ రోడ్డులోని పట్లోల ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అనంతరం కౌకుంట్ల గ్రామంలో ఉన్న ఇంద్రారెడ్డి సమాధి వద్దకు చేరుకున్న మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు మరియు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇంద్రారెడ్డి సేవలు మరువలేవని ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన ఇంద్రారెడ్డి, ప్రతినిత్యం ప్రజలలో ఉంటూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతినిత్యం ఆలోచించేవాడని ఆమె తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం మొట్టమొదటిగా కొట్లాడిన వ్యక్తిగా ఇంద్రారెడ్డి నిలిచిపోతారని ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలని సంకల్పంతో ఇంద్రారెడ్డి ఉన్నప్పుడు అనేకమార్లు మాట్లాడేవాడని ఆమె తెలిపారు. ఆయన చనిపోయి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన కార్యకర్తలకు, అలాగే 25 సంవత్సరాలుగా ఆదరించి తమ కుటుంబానికి అండగా నిలిచిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కార్తీక్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రపంచంలోనే అతి పురాతన మతం హిందూమతమే...

### ప్రముఖ రచయిత వడ్డి విజయ సారధి...



**కరీంనగర్, మహా:** హిందూ మతం ప్రపంచంలోనే అతి పురాతన మతంగా విరసిల్లుతుందని , హిందూ మత చరిత్ర అనేక సాంప్రదాయాలు భిన్న సంస్కృతుల మీద ఆధారపడి ఉందని ప్రముఖ రచయిత వడ్డి విజయ సారధి అన్నారు. కరీంనగర్ పట్టణం మళయాల సద్గురు గీతామందిర మఠంలో సద్భావన సదస్సు జరిగింది.ఇట్టి సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన విజయసారధి మాట్లాడుతూ హిందూ మతం చరిత్ర భారతదేశ రాతియుగం నుండి ఉనికి చాటుతుందన్నారు. 7వ శతాబ్దంలో పుట్టుకొచ్చిన ఇస్లాం కేవలము 100 సంవత్సరాల్లోనే మధ్యప్రాచ్యం అంతటా వ్యాపించిందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ఆయా దేశాలలో రాజు ఓడింపబడి అతను ఏ మతాన్ని ఆచరిస్తే,ఆ దేశ ప్రజలందరు అదే మతం స్వీకరించే పరిస్థితి ఉండేదని , కాని భారతదేశం ఇందుకు భిన్నంగా ఉండేదని ,రాజు ఓడించబడ్డప్పటికి,ప్రజలు మతం మారలేదన్నారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని , భారతదేశం అనేక సాంప్రదాయాలు భిన్న సంస్కృతుల సమన్వయంగా అనేక పునాదులతో ఏర్పడిందన్నారు. ముఖ్యంగా వేద కాలంలో హిందూ మతం , బౌద్ధమతం, జైన మతాలు విరసిల్లాయన్నారు. అనంతరం గుప్త సామ్రాజ్య కాలాన్ని పురాణాల కాలంగా పిలిచేవారని, ఈ కాలం. హిందూ మత చరిత్రలో సువర్ణ కాలంగా వ్యవహరింపబడిందని పేర్కొన్నారు. ఈ కాలంలోనే సమాఖ్య, యోగ, న్యయ, వైశేషిక , మిమాంస, వేదాంత అనే ఆరుహిందూ వేదాంత శాస్త్రాలు ఉద్భవించాయన్నారు. ఎంతో చరిత్ర కలిగిన హిందూ ధర్మాన్ని, హిందూ భావజాలాన్ని పెద్దలు తమ పిల్లలకు తమ అందించాల్సిన అవసరంఉందన్నారు., హిందూ ధర్మం ,సంస్కృతి,సంప్రదాయాలను అందించకుండా,ఆస్తులను సంపాదించటంలో,వస్తుప్రపంచంపై మక్కువ పెంచుకోవటం అనర్థాలకు మూలం అవుతుందన్నారు. ఇట్టి ప్రోగ్రాంలో సద్భావన సదస్సు నిర్వాకులు అశోక్ రావు, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ సి ఎ.డి. నిరంజనాచారి , ఎలగందుల సత్యనారాయణ లతో పాటు 65 మందిపురప్రముఖులుపాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతుకు మేలు

## ధరణి పేరుతో రైతులను దగా చేసిన గత పాలకులు

## సాగులో ఉన్న రైతులందరికీ పట్టాలు అందజేస్తాం: రాష్ట్ర మంత్రి సీతక్క

**ములుగు, మహా:** గత పాలకులు ధరణి పేరుతో రాష్ట్రంలోని రైతులందరినీ దగా చేశారని, అప్పటి అధికార పార్టీ నాయకులు లక్షలాది ఎకరాల భూమి పేరుతో కోట్లాది రూపాయలు దిగమింగారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలసి భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సు కు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం ఎవరి భూమి వారికి చెందే విధంగా పట్టాలు అందజేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టారని, గతంలోని ధరణి పోర్టల్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. 50 సంవత్సరాల నుండి సాగు



చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందకపోవడంతో వారికి ఎలాంటి లబ్ధి చేకూరలేదని, నేడు నిజమైన రైతులకు పట్టాలు అందజేసి ప్రభుత్వ ఫలాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామాలలోని భూ సమస్యలు స్థానిక తాహసిల్దార్ తో పరిష్కారం కానిపక్షంలో ఆర్డిఓ, కలెక్టర్, సీసీఎల్ఏ ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, భూముల విషయంలో రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని అన్నారు. గత పది సంవత్సరాలుగా నిరుపేద రైతులకు ఒక్క ఎకరం భూమి సైతం అప్పటి పాలకులు ఇవ్వలేదని, నేటి ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని అన్నారు. వివిధ రకాల సమస్యలున్న భూములను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంగపేట మండల పరిధి లోని 38 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులకు చెక్కులను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, తహసిల్దార్ రవీందర్, ఎం పి డి ఓ భద్రు నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి చేరాలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు, కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలి - ఎస్పీ అఖిల్ మహాజన్

## బి సేఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన.. ట్రాఫిక్ నియమాల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

**ఆదిలాబాద్ మహా :** ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. బిసేఫ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ లో ట్రాఫిక్ నియమాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు పాటించడమే సరైన చర్య అని అన్నారు.ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని సూచించారు.సెల్ఫోన్ లో మాట్లాడుతూ వాహనాన్ని నడపవద్దన్నారు.ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు.ప్రతి ఒక్క వాహనానికి ట్రాఫిక్ నిబంధనల నియమావళి ప్రకారం అన్ని కాగితాలు ఉండాలన్నారు.బండి నడిపేటప్పుడు తప్పకుండా



ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.ట్రాఫిక్ నియమాలకు సంబంధించి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.అనంతరం ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని, వారి కుటుంబ సభ్యులతో పాటింపజేసేలా ముందుండి ప్రోత్సహిస్తామని విద్యార్థులచే చెప్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి జీవన్ రెడ్డి, సీఐ సునీల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రణయ్ కుమార్, బీసేఫ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ గన్ శామ్ ఓజా, సభ్యులు మహిపాల్ రెడ్డి, అమూల్ ఓజ, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉదారతను చాటుకున్న ఉప్పల వెంకటేష్

**రంగారెడ్డి జిల్లా మహా:** పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆదుకున్న ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్. మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం, హరియా నాయక్ తండ గ్రామానికి చెందిన కేతావత్ జ్యోతి జగన్ ల తన కూతురి వివాహానికి, ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, తన ఉదారతను చాటుకుని గిరిజన పేదింటి ఆడబిడ్డకు బియ్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొర్ర కృష్ణ నాయక్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు

## పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

**కాటారం, మహా :** విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత చదువులు చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఉద్ఘాటించారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాల, గణపురం మండలంకేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన పాఠశాలల వార్షికోత్సవ వేడుకల్లో భూపాలపల్లి శాసన సభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల నృత్యాలు, కోలాటాలు చాలా ఆకర్షించాయి. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఎం ఎల్ ఏ మాట్లాడుతూ ప్రతీ ఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసాన్ని నింపుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులతోడ్పాటు ఉంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి, వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. చదవుతో పాటు ఆటపాటలు కూడా చాలా అవసరం అన్నారు.



నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని కోరారు.విద్యార్థుల కళా ప్రదర్శన అద్భుతంగా ఉందని అన్నారు.చెల్పూర్ పాఠశాలలో వాష్ రూమ్స్ మరియు పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఘనపూర్ మండలం మోడల్ పాఠశాలలో డైనింగ్ హాల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయిస్తానని అన్నారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఎమ్మెల్యే ఉపాధ్యాయులను శాలువాతో సన్మానం చేశారు. అడిషనల్ కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి , జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ , మండల ఎంపిడిఓ ,ఉపాధ్యాయులు , విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కీచక టీచర్ అరెస్ట్

**ఆదిలాబాద్ మహా :** విద్యార్థినీలు ,లేడీ టీచర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో వెల్లడించారు.మావల జడ్పీ హైస్కూల్లో పీఈటిగా విధులు నిర్వర్తిస్తున్న గుండి మహేష్ (54) దురుద్దేశ పూర్వకంగా విద్యార్థినీల శరీర భాగాలు తాకుతూ వేధించినట్టు షీటీమ్ కు అందిన ఫిర్యాదు ఆధారంగా ,అదేవిధంగా తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఒక యోగ టీచర్ ఫిర్యాదుతో రెండు కేసులు నమోదు చేసినట్టు వివరించారు.విద్యాబుద్ధులను ఆటలను నేర్పవలసిన టీచర్ శారీరకంగా వేధించడం సభ్య సమాజానికి చెడ్డ పేరును తీసుకొస్తుందన్నారు. ఈ సందర్భంగా షీ టీం బృందాలు మరింత విస్తృతంగా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎలాంటి ఇబ్బందులు కలిగిన జిల్లాలోని మహిళలు యువతులు, విద్యార్థినిలు షీ టీం బృందాలను సంప్రదించాలని తెలిపారు. షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా షీ టీం బృందాలను సంప్రదించాలంటే 8712659953 నంబర్ కు ఫోన్ చేయాలన్నారు. అలాగే మద్యం సేవించి విధులకు హాజరవుతున్నవారిపై సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తూ చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హన్మకొండ, మహా.;** హనుమకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 01, 02, 03,14, 43 డివిజన్ల పరిధిలో అనారోగ్యానికి గురైన వారు సిఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన 52 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద (సీఎంఆర్ఎఫ్) సుమారు 13లక్షల 99 వేల రూపాయల విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంను 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచామని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ పేదవారికి సంక్షేమ పథకాలు అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తున్నామని,పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సర్కార్ పని చేస్తోందని,ఇది పేదల ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. పేదలకు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలకు రాజకీయాలకతీతంగా మద్దతు పలకాలని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి



లోని సుదీర ప్రాంతాల నుంచి నా దగ్గరికి డబ్బులు ఖర్చు కాకుండా మీకు ఏ సమస్య ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 8096107107 నెంబర్ కి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 01, 02, 03, 14, 43, డివిజన్ల పరిధిలో ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు....



# సస్పెండ్ చేయించాడనే ఆక్రోషంతో యువకుడి దారుణ హత్య

## వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

**హన్మకొండ మహా;** తన బంధువుతో అక్రమ సంబంధం కోనసాగిస్తున్నాడని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి కానిస్టేబుల్ సస్పెండ్ కు కారణమైన సాయి ప్రకాశ్ అనే యువకుడుని అతి దారుణంగా హత్య చేసిన కానిస్టేబుల్ తో సహా ఐదుగురిని హన్మకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు వినియోగించిన ఒక కారు, రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఎయిర్ పిస్తోల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి

## అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మహా:** దీర్ఘకాలిక భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామడుగు మండల కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ లో మంగళవారం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావు లేకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదా బైనమాలు, పాసు పుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా 'భూధార్'ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, వారసత్వ



మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ భూ భారతి చట్టం దేశానికి దిక్సూచిలా నిలవనుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. ధరణి చట్టంలోని లోపాలు రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించేలా చేశాయని, రైతులను ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. రైతు అవసరానికి భూమి అమ్ముకొనివ్వకుండా చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా పేరుకుపోయిన భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉండడం ద్వారా రైతులు అన్ని స్థాయిల్లో ఉన్న అధికారులకు అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్ కు ఈ చట్టంలో సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. 2004లో ఆ నాటి ప్రభుత్వం రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.తమ ప్రభుత్వం సుమారు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసిల్దార్ వెంకటలక్ష్మి ఇతర శాఖల అధికారులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.



## కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

### ఎ మంత్రి ధనసరి సీతక్క

**ములుగు, మహా :** శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మంగళవారం మంగపేట మండల మల్లూరు గ్రామం లోని శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారుల తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మే 8వ తేది నుండి 17 వరకు శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్యం, త్రాగునీటి పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# రైతుల మేలు కొరకై భూ భారతి

## ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

## రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు తెలుస్తాయి

## పైరవీలు అవసరం లేని భూభారతి పోర్టల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల, యాచారం మండలాల్లో భూ భారతి చట్టం 2025 అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ నారాయణ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మండలాలలో ధరణితో అనేక సమస్యలు తలెత్తి, కుటుంబాల మధ్య చిచ్చు పెట్టించి, వారి మధ్య విభేదాలను సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైతుల మేలు కోసం భూ భారతిని తెచ్చారని తెలిపారు. రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు, భూమితో రైతుకు ఉన్న అనుబంధం తెలుస్తుందని, భూ భారతి అమలుతో నియోజకవర్గంలోని రైతులందరికీ మేలు జరుగుతుందని అన్నారు.

**పైరవీలు అవసరం లేదు.. పోర్టల్లో పరిష్కారాలు...**

భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూమికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. భూముల అమ్మకాలు, కొనుగోలు సులభంగా జరుగుతాయన్నారు.



సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయని చెప్పారు. మీ భూముల సమస్యల పరిష్కారానికి ఎవ్వరి దగ్గర పైరవీలకు పోవాల్సిన అవసరం లేదనీ, భూ భారతి పోర్టల్ లో అన్ని రకాల ఆప్షన్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, ఎమ్మార్వోలు ప్రసాద్ రావు, అయ్యప్ప, ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, ముత్యాల రాజశేఖర్ రావు, రాచర్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

## రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


## ఏప్రిల్ 30 లోపు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రతి దశలో లబ్ధిదారులకు సహకారం అందించాలి

## భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి

## ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ ఫీజులో 25% రాయితీ గడువు పొడిగింపు ఉండదు

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ఎల్.ఆర్.ఎస్ పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు. పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికనుఅధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్డ్



వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలను ఇటీవలే విడుదల చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెద్ద సంఖ్యలో గ్రౌండ్ అవుతున్న నేపథ్యంలో ఎక్కడ సామాగ్రి ధరలు అనుభవంగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపారులు ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు. మండలంలో నిర్మించిన మోడెల్ ఇండ్లు నమూనాలను లబ్ధిదారులకు చూపించాలని మంత్రి అధికారులకు సూచించారు. పేదలకు ఇంటి నిర్మాణంలో ప్రతి దశ లోను అధికారులు సహాయం అందించాలని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అన్నారు. 5 లక్షల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తున్నందున అత్యంత నిరు పేదలకు మొదటి విడతలో ఎంపిక చేయాలని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ లో అత్యుత్తమ మార్కులు వచ్చిన యువకులను తాత్కాలిక ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇంజనీర్లుగా నియమిస్తున్నామని, వీరికి అవసరమైన శిక్షణ అందించి త్వరలోనే మండలాలకు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. ప్రతి మండలంలో జరిగే ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేస్తూ సదరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల సహాయం త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలలో స్లం ఏరియాలో జి+3 మోడల్ లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించేందుకు వీలుగా లబ్ధిదారులు ముందుకు వస్తే రాబోయే విడత లలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. భూ భారతి చట్టం మన రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద 4 మండలాలలో ముందస్తుగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో ఈ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి సూచించారు. 4 మండలాలో రెవెన్యూ సదస్సులు పూర్తి చేసుకున్న తర్వాత అందులో నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో ఒక మండలం నుంచి తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతి జిల్లాకు అవసరమైన సర్వే సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు.

## మహీంద్రా ఆటో కొత్త అధ్యక్షుడు ఎవరీ వేలుసామి?



మహీంద్రా ఆటో తన కొత్త అధ్యక్షుడిగా ఆర్ వేలుసామిని నియమిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవెలప్మెంట్ అధ్యక్షుడిగా ఉన్న వేలుసామి, విజయ్ నక్రా స్థానంలో తన కొత్త పదవిని చేపడతారు. 1996లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరిన వేలుసామి.. వివిధ స్థాయిలలో కీలక పదవులను చేపట్టారు. ఐసీఈ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఆయన ప్రధాన పాత్ర పోషించారు. మహీంద్రా ఆటో అధ్యక్షుడిగా వేలుసామి.. లాభ, నష్టాలు, డెలివరీతో సహా కంపెనీ ఆటోమోటివ్ కార్యకలాపాలకు పూర్తి బాధ్యత ఉంటుంది. వ్యవసాయ పరికరాల రంగానికి ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్ సిక్కాను దాని బోర్డు మహీంద్రా లాజిస్టిక్స్ లిమిటెడ్ (MLL) మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓగా నియమించింది. మునుపటి సీఈఓ రామ్ స్వామినాథన్ పదవీవిరమణ చేసి కొత్త వృత్తిపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నారు.

## కొత్త కస్టమర్లు ఎయిర్‌టెల్‌కే ఎక్కువ!




దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య జనవరిలో స్వల్పంగా పెరిగి 119 కోట్లకు చేరింది. వైర్‌లైన్, మొబైల్ సెగ్మెంట్లలో కొత్త సబ్‌స్క్రయిబర్స్‌ను దక్కించుకోవడంలో ఎయిర్‌టెల్ అగ్రస్థానంలో నిల్చింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం గతేడాది డిసెంబర్‌లో 118.99 కోట్లుగా ఉన్న టెలికాం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య జనవరిలో 119.20 కోట్లకు పెరిగింది. మొబైల్, వైర్‌లైన్ సెగ్మెంట్‌లో ఎయిర్‌టెల్ యూజర్లు వరుసగా 16.53 లక్షలు, 1.17 లక్షల మేర పెరిగారు. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్‌ను వైర్‌లెస్ సర్వీసుగా ట్రాయ్ వర్గీకరించింది. ప్రస్తుతం ఈ విభాగంలో 48.44 లక్షల యూజర్లతో రిలయన్స్ జియో అగ్రస్థానంలో, 8.72 లక్షల సబ్‌స్క్రయిబర్స్‌తో ఎయిర్‌టెల్ రెండో స్థానంలో ఉన్నాయి.

**మరిన్ని ముఖ్యంశాలు..**

- మొబైల్ సెగ్మెంట్‌లో జియో 46.5 కోట్ల యూజర్లతో నంబర్‌వన్‌గా, 38.69 కోట్ల మందితో ఎయిర్‌టెల్ రెండో స్థానంలో ఉన్నాయి. వొడాఫోన్ ఐడియా 13 లక్షల కనెక్షన్లను, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 3.69 లక్షలు, ఎంటీఎన్ఎల్ 2,617 మంది కస్టమర్లను కోల్పోయాయి.
- వైర్‌లైన్ విభాగంలో బీఎస్ఎన్ఎల్ 39,953, ఎంటీఎన్ఎల్ 9,904, క్వాడ్రాంట్ 4,741, వొడాఫోన్ ఐడియా 3,447 మంది కస్టమర్లను పోగొట్టుకున్నాయి.
- జియో, ఎయిర్‌టెల్ నిర్దేశిత ఫార్మాట్‌లో డిసెంబర్, జనవరి డేటాను సమర్పించకపోవడంతో ట్రాయ్ బ్రాడ్‌బ్యాండ్ యూజర్ల వివరాలను అప్‌డేట్ చేయలేదు.

## స్టీల్‌పై సేఫ్‌గార్డ్ డ్యూటీ..

### 200 రోజుల వరకూ 12 శాతం



సుంకాల పరిధిలో చేర్చిన ఐదు రకాల(విభాగాల) స్టీల్ ప్రొడక్టుల దిగుమతి ధరలు టన్నుకి 675 డాలర్ల నుంచి 964 డాలర్ల మధ్య నిర్ణయించింది. ఈ ధరల కంటే దిగువన దిగుమతయ్యే ప్రొడక్టులకు సేఫ్‌గార్డ్ డ్యూటీ వర్తించనుంది. వీటికంటే అధిక ధరలకు దిగుమతయ్యే(జాబితాలో చేర్చిన) ప్రొడక్టులపై సుంకాలు అమలుకాబోవు.

**న్యూఢిల్లీ:** ప్రభుత్వం తాజాగా ఐదు విభాగాల స్టీల్ ప్రొడక్టులపై సేఫ్‌గార్డ్ డ్యూటీకి తెరతీసింది. 200 రోజులపాటు అమలయ్యే విధంగా 12 శాతం సుంకాన్ని విధించింది. ఈ జాబితాలో హాట్ రోల్‌డ్ క్వాయిల్స్, షీట్లు, ప్లేట్లు తదితరాలున్నాయి. తద్వారా పెరుగుతున్న దిగుమతుల నుంచి దేశీ సంస్థలకు రక్షణ కలిపేందుకు చర్యలు చేపట్టింది. వాణిజ్య శాఖ దర్యాప్తు విభాగం డీజీటీఆర్ సలహాలమేరకు ప్రభుత్వం స్టీల్ దిగుమతులపై తాజా సుంకాలను విధించింది. వాణిజ్య పరిష్కారాల డైరెక్టర్ జనరల్ సూచనలమేరకు కేంద్ర ప్రభుత్వం 12 శాతం విలువ ఆధారిత ప్రొవిజనల్ సేఫ్‌గార్డ్ డ్యూటీని విధించినట్లు ఆదాయ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా సుంకాలు గడువుకంటే ముందుగా ఎత్తివేయడం లేదా మార్పులు చేపట్టడం వంటివిలేకుంటే 200 రోజులపాటు అమల్లో ఉంటాయని తెలియజేసింది.

## వాహనాలకూ సైబర్ రిస్కులు



కార్లు, రవాణా వాహనాలు మరింత కనెక్టెడ్‌గా, సాఫ్ట్‌వేర్ ఆధారితమైనవిగా మారిపోతున్న నేపథ్యంలో ఎయిర్‌బ్యాగ్‌లలాగా ఆటోమోటివ్ సైబర్‌సెక్యూరిటీ కూడా ప్రామాణిక ఫీచరుగా మారనుందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. అంతర్గతంగా వాహన నెట్‌వర్క్ ట్యాంపరింగ్, జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్, స్టీరింగ్.. బ్రేకింగ్ మొదలైన సిస్టమ్‌లను రిమోట్‌గా కంట్రోల్ చేయడం వంటి సైబర్‌సెక్యూరిటీపరమైన ముప్పులు కొత్త తరం వాహనాల్లో గణనీయంగా ఉంటున్నాయని పరిశ్రమవర్గాలు తెలిపాయి. ఇలాంటి రిస్కుల నుంచి వాహనాలను కాపాడేందుకు అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా పలు సంస్థలు వాహన రంగం కోసం సైబర్‌సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నాయి. నియంత్రణ సంస్థలు నిర్దేశించినట్లుగా ఎయిర్‌బ్యాగ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్ల తరహాలోనే డిజిటల్ భద్రత సాధనాలూ వాహనాల్లో తప్పనిసరి ఫీచర్లుగా మారొచ్చని సైబర్‌సెక్యూరిటీ సంస్థ హ్యాకర్స్‌ఎరా వ్యవస్థాపకుడు వికాస్ చౌదరి తెలిపారు. ఐడీపీఎస్ (ఇన్‌ట్రూజన్ డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ సిస్టమ్స్), వీఎస్ఓసీ (వెహికల్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్స్) లాంటి సిస్టమ్‌లు ముప్పులను నివారించడానికే కాకుండా కొనుగోలు ప్రణాళికలనూ ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. పెద్ద ఎత్తున వాహనాలను నిర్వహించే ఫ్లీట్ ఆపరేటర్లు, కనెక్టెడ్ ప్రజా రవాణా వ్యవస్థలు మొదలైన వాటికి సంబంధించి ఏ ఒక్క వాహనంలోనైనా సెక్యూరిటీపరమైన సమస్యలు తలెత్తితే అవి మొత్తం నెట్‌వర్క్ అంతటికీ వ్యాపించే అవకాశం ఉంటుందని చౌదరి తెలిపారు. ఇలాంటి వాటిని కట్టడి చేసేందుకు రూపొందించిన వీఎస్‌వోసీలు సాంప్రదాయ ఐటీ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్లలాగానే పని చేస్తాయి. కానీ ఇవి ప్రత్యేకంగా వాహనాల కోసం రూపొందించినవై ఉంటాయి. వాహనాల నుంచి వీటికి రియల్ టైమ్‌లో డేటా లభిస్తుంది. తద్వారా రిస్కులకు దారి తీసే ధోరణులను, ముప్పులను ఇవి పసిగట్టగలవు. కొత్త తరం వాహనాలకు డిజిటల్ సేఫ్టీ ప్రోగ్రాంలను రూపొందించడం కోసం వాహనాల తయారీ సంస్థలు, సరఫరాదారులు, మొబిలిటీ స్టార్టప్‌లతో తాము కలిసి పని చేస్తున్నట్లు చౌదరి వివరించారు. ఎథర్‌నెట్, ఆర్‌ఎఫ్, బ్లూటూత్ మొదలైన వాటన్నింటికీ దేని రిస్కు దానికి ఉంటుందని, ఒక్కో దానికి ఒక్కో రకమైన రక్షణ అవసరమని పేర్కొన్నారు. కనెక్టెడ్ వాహనాల్లో బలహీనతలను గుర్తించేందుకు, తగిన విధంగా పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాల్సి ఉంటుందని టాటా మోటార్స్ ప్రతినిధి తెలిపారు. ఐఎస్‌వో/ఎస్‌ఏఈ 21434లాంటి పరిశ్రమ ప్రమాణాలకు కట్టుబడి ఉండటం ద్వారా ఉత్తమ విధానాలను పాటించవచ్చని పేర్కొన్నారు. కంపెనీలు ఎప్పటికప్పుడు వాహన సాఫ్ట్‌వేర్‌ను లేటెస్ట్ సెక్యూరిటీ ప్యాచ్‌లతో అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు.

## సెన్సెక్స్ డబుల్ హ్యాట్రిక్..



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో దూసుకెళ్తున్నాయి. మంగళవారం లాభాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్ల లాభాలతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బెంచ్మార్క్ సూచీలు వరుసగా ఆరో ట్రేడింగ్ రోజు కూడా విజయ పరంపరను కొనసాగించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 320 పాయింట్ల సానుకూల తేడాతో 79,728 వద్ద రోజును ప్రారంభించింది. కానీ కొంత సేపటికే లాభాలను కోల్పోయి 79,253 వద్ద ఎరుపులోకి జారుకుంది. తర్వాత పుంజుకుని పాజిటివ్ జోన్లో కన్సాలిడేట్ కాగా, ఇంట్రాడే గరిష్ట స్థాయి 79,824ను తాకింది. చివరకు సెన్సెక్స్ 187 పాయింట్ల లాభంతో 79,596 వద్ద స్థిరపడింది. ఈ ప్రక్రియలో సెన్సెక్స్ గత ఆరు వరుస ట్రేడింగ్ సెషన్లలో 7.8 శాతం లేదా 5,749 పాయింట్లు పెరిగింది. ఇక నిఫ్టీ 50 ఇండెక్స్ 24,072 వద్ద కనిష్టాన్ని తాకి తిరిగి 24,243 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరకు 0.2 శాతం లేదా 42 పాయింట్ల లాభంతో 24,167 వద్ద స్థిరపడింది. మంగళవారం 29వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ ఎన్ఎస్ఈ బెంచ్‌మార్క్ గత ఆరు రోజుల్లో 7.9 శాతం లేదా 1,768 పాయింట్లు పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎఫ్ఎంసీజీ మేజర్ ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ 2 శాతానికి పైగా లాభపడ్డాయి. అదేసమయంలో మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జొమాటో, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు, మైక్రోఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలో రూ .600 కోట్ల వ్యత్యాసంపై దర్యాప్తు చేయడానికి మరో రౌండ్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడానికి బ్యాంక్ ఈవైని రంగంలోకి దింపడంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ 5 శాతం నష్టపోయింది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ 12 శాతం మధ్య క్షీణించాయి. విస్తృత మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలను అధిగమించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ రెండూ మంగళవారం 0.8 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్ఈలో 1,500 షేర్లు క్షీణించగా, దాదాపు 2,500 షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీ సూచీల్లో బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ 2.4 శాతం, ఎఫ్ఎంసీజీ 1.9 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.4 శాతం లాభపడ్డాయి.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




## చైనాలో 10జీ నెట్‌వర్క్..!

**బీజింగ్:** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సముపార్జనలో డ్రాగన్ దేశం చైనా మరో అడుగు ముందుకు వేసింది. ప్రపంచంలోనే మొట్ట మొదటిసారిగా 10 గిగాబైట్స్ ఫర్ సెకన్స్() వేగంతో పనిచేసే 10జీ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. రాజధాని బీజింగ్ సమీపంలోని హుబే ప్రావిన్స్‌లో చేపట్టిన ప్రయోగ పరీక్షలో గరిష్టంగా 10 జీబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ పని చేసినట్లు మీడియా వెల్లడించింది. ఈ వేగంతో అత్యంత స్పష్టతతో కూడిన రెండు పూర్తి సినిమాలను కేవలం సెకన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్లౌడ్ కంప్యూటింగ్, టెలీ మెడిసిన్ తదితర రంగాల్లో దీనితో ఎన్నో మార్పులు సంభవించనున్నాయి.

## నష్టం కలిగిస్తే ప్రతీకారం తప్పదు



**బీజింగ్:** టారిఫ్‌ల నుంచి తప్పించుకునే క్రమంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దేశాలకు చైనా హెచ్చరికలు చేసింది. ఆ ఒప్పందాలతో తమకు నష్టం వాటిల్లే పక్షంలో ప్రతీకార చర్యలు తప్పవని ఆయా దేశాలకు తేల్చి చెప్పింది. ఇటువంటి ఒప్పందాలకు తాము పూర్తిగా వ్యతిరేకమని చైనా వాణిజ్య శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. అత్యధిక సుంకాల నుంచి మినహాయించినందుకు ప్రతిఫలంగా చైనాతో వాణిజ్య సంబంధాలను పరిమితం చేయాలంటూ ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో వాణిజ్య శాఖ ప్రతినిధి ఈ ప్రకటన చేశారని అధికార జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. 'ఒక వేళ అటువంటి పరిస్థితే ఏర్పడితే చైనా ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోదు. తీవ్ర ప్రతీకార చర్యలు తీసుకుంటుంది. తాత్కాలిక లాభం కోసం ఇతరుల ప్రయోజనాలను ఫణంగా పెట్టాలని చూడటం పులి చర్మం కోసం దానితో బేరమాడటం వంటిదే. ఎదురుదెబ్బ తప్పదు'అని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు. తమతో లాభదాయకమైన వ్యాపార సంబంధాలు కలిగిన పలు దేశాలు సుంకాల మినహాయింపులు పొందడానికి అమెరికాతో ప్రత్యేక వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోకుండా నిరోధించడానికే చైనా ప్రభుత్వం ఈ ప్రకటన చేసినట్లుగా భావిస్తున్నారు. జపాన్, ఈయూ, ఆసియాన్‌లోని పలు దేశాలు అమెరికాతోపాటు చైనాతోనూ విస్తృత వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. భారత్ కూడా అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. చైనా వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 245 శాతం టారిఫ్‌లు ప్రకటించగా, చైనా సైతం అమెరికా వస్తువులపై 125 శాతం టారిఫ్‌లు విధించింది. ఎక్కువగా ఎగుమతులపైనే ఆధారపడిన చైనా ఆర్థిక వ్యవస్థపై అమెరికాతో ఆసియాన్ లాంటి భాగస్వాములు కుదుర్చుకునే ఒప్పందాలతో ప్రతికూల ప్రభావం చూపుతుంది.

## ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ..



**న్యూఢిల్లీ:** నాలుగు రోజుల పర్యటనలోభాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సోమవారం ఉదయం 9.50 గంటలకు ఢిల్లీలోని పాలెం వైమానిక స్థావరంలో దిగారు. తెలుగమ్మాయి, భార్య ఉషా చిలుకూరి, తమ ముగ్గురు సంతానం ఇవాన్, వివేక్, మీరాబెల్‌తో కలిసి వాన్స్ 'ఎయిర్‌ఫోర్స్ టు' విమానం నుంచి దిగారు. ఈ సందర్భంగా వాన్స్ దంపతులకు ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ కేంద్ర కేబినెట్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సాదర స్వాగతం పలికారు. వాన్స్‌తో పాటు అమెరికా జాతీయ భద్రతా మండలి సీనియర్ డైరెక్టర్ రికీ గిల్, ఇతర ఉన్నతాధికారులు వచ్చారు. ఎయిర్‌బేస్‌లోనే కళాకారులతో ఏర్పాటుచేసిన నృత్య కార్యక్రమం వాన్స్ కుటుంబసభ్యులను అలరించింది. తర్వాత వాన్స్ భారత త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. వాన్స్ పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక వాన్స్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి.

**భారతీయ దుస్తుల్లో పిల్లలు**

విమానం దిగేటప్పుడు వాన్స్ ముగ్గురు పిల్లలు భారతీయ దుస్తుల్లో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎనిమిదేళ్ల పెద్దకుమారుడు ఇవాన్ బూడిద రంగు కుర్తా, తెలుపు పైజామా ధరించాడు. ఐదేళ్ల కుమారుడు వివేక్ పసుపు రంగు కుర్తా, తెలుపు పైజామా ధరించాడు. మూడేళ్ల కుమార్తె ఆకుపచ్చ రంగు అనార్కలీ సూట్, జాకెట్ ధరించారు. అమెరికా సెకండ్ లేడీ, వాన్స్ భార్య ఉషా ఆధునిక దుస్తుల్లో కనిపించారు. స్వాగత కార్యక్రమం పూర్తయ్యాక వాన్స్ కుటుంబం ఢిల్లీకి తరలివెళ్లింది.

**అక్షరధామ్ ఆలయ సందర్శన**

ఢిల్లీలో తొలుత అక్షరధామ్ ఆలయాన్ని వాన్స్ కుటుంబం సందర్శించింది. యమునా తీరంలో అత్యద్భుతంగా నిర్మించిన స్వామినారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని చూసి వాన్స్ కుటుంబం పులకించిపోయింది. లోపలికి వెళ్లి దర్శనం చేసుకున్నాక ఆలయం మొత్తం కలియతిరిగారు. గజేంద్రపీఠంను చూసి అచ్చెరువొందారు. '' ఇంతటి సుందర ప్రదేశంలో సాదర స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చినందుకు కృతజ్ఞతలు. ఎంతో నేర్పుతో శ్రద్ధతో ఇంత అందమైన ఆలయాన్ని నిర్మించిన భారత్‌ను ప్రశంసించాల్సిందే. మా పిల్లలకు ఈ ఆలయం ఎంతో నచ్చింది'' అని అక్కడి సందర్శకుల పుస్తకంలో వాన్స్ రాశారు. వాన్స్ దంపతులకు ఢిల్లీ అక్షరధామ్ ఆలయ నమూనాను, చెక్క ఏనుగును చిన్నారులకు చిన్నపిల్లల పుస్తకాన్ని ఆలయ నిర్వాహకులు కానుకగా ఇచ్చారు. ఆలయం ఎంతో ప్రశాంతంగా ఉందని వాన్స్ కుటుంబం తనతో చెప్పిందని వాళ్లకు ఆలయంలో సహాయపడిన మీరా సోందాగర్ చెప్పారు. తర్వాత వాన్స్ దంపతులు జన్‌పథ్‌లోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రీస్ ఎంపోరియంను సందర్శించారు. అక్కడ కొన్ని భారతీయ హస్తకళలను కొనుగోలుచేశారు. ఢిల్లీలో ఉన్నంతసేపు వాన్స్ కుటుంబం ఐటీసీ మౌర్య షెరటాన్ హోటల్‌లో బసచేయనుంది.

**ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకే..**

గతంలో అమెరికా ఉపాధ్యక్షులు విచ్చేసినప్పుడు కేంద్ర సహాయ మంత్రి, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వంటి వారు మాత్రమే స్వాగతం పలికారు. ఈసారి ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి ఏకంగా కేంద్ర కేబినెట్ మంత్రి అమెరికా ఉపాధ్యక్షుడికి సాదర స్వాగతం పలికారు. కేబినెట్ ర్యాంక్ స్థాయి నేత ఇలా స్వయంగా ఆహ్వానం పలకడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. 2023 సెప్టెంబర్‌లో నాటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం వచ్చినప్పుడు పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి వీకే సింగ్ స్వాగతం పలికారు. బైడెన్ 2013లో ఉపాధ్యక్ష హోదాలో వచ్చినప్పుడు నాటి విదేశాంగ శాఖ కార్యదర్శి రంజన్ మథాయ్ స్వాగతం పలికారు. ట్రంప్ అధ్యక్షునిగా 2020లో వచ్చినపుడు కేబినెట్ మంత్రి కాకుండా కేవలం సహాయ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ట్రంప్‌కు స్వాగతం పలికారు. సుంకాల భారం మోపుతూ భారత్ పట్ల ఆగ్రహం ఉన్న ట్రంప్ సర్కార్‌ను వాన్స్ ద్వారా ప్రసన్నం చేసుకునేందుకు మోదీ సర్కార్ ఇలా కేబినెట్ మంత్రిని పంపించి సాదరంగా ఆహ్వానించింది.

### నేడు జైపూర్‌లో సందర్శన

మంగళవారం ఉదయం నుంచి జైపూర్‌లోని పలు చారిత్రక ప్రదేశాలను వాన్స్ కుటుంబం సందర్శించనుంది. తొలుత జైపూర్‌లోని రామ్‌భాగ్ ప్యాలెస్‌లో బస చేస్తారు. మంగళవారం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన అంబర్ కోటకు వెళ్తారు. సాయంత్రం జైపూర్‌లోని రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో వాన్స్ ప్రసంగిస్తారు. బుధవారం ఉదయం వాన్స్ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో చరిత్రాత్మక కట్టడం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. తర్వాత భారతీయ శిల్పకళల ప్రదర్శనశాల అయిన శిల్పాగ్రామ్‌కు వెళ్తారు. సాయంత్రం మళ్లీ జైపూర్‌కు వస్తారు. జైపూర్ నుంచి గురువారం ఉదయం అమెరికాకు బయల్దేరతారు.


## ట్రంప్ యాక్షన్.. హార్వర్డ్ యూనివర్సిటీ రియాక్షన్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలకు.. హార్వర్డ్ యూనివర్సిటీతగ్గేదే లే అంటోంది. విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులకు ట్రంప్ సర్కార్ కత్తెర వేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరో కత్తెరకు సిద్ధపడుతున్న తరుణంలో విశ్వవిద్యాలయం అనూహ్యంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఫెడరల్ నిధులను నిలిపివేయడం ద్వారా.. విద్యాపరమైన నిర్ణయాలపై నియంత్రణ సాధించడానికి ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ మసాచుసెట్స్ కోర్టులో దావా వేసింది. అంతేకాదు పలు యూనివర్సిటీలను కూడా ట్రంప్ లక్ష్యంగా చేసుకున్నారంటూ దావాలో ప్రస్తావించింది. ట్రంప్ చర్యలు ఏకపక్షంగా ఉన్నాయని.. ఫెడరల్ చట్టాలను, నిబంధలను ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంది. నిధులను స్తంభింపజేయడం, ఫెడరల్ సమాఖ్య గ్రాంట్లపై విధించిన షరతులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని, హార్వర్డ్ ఖర్చులను చెల్లించేలా ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని దావాలో హార్వర్డ్ యూనివర్సిటీ కోరింది. హార్వర్డ్ యూనివర్సిటీకి వైట్‌హౌస్ పలు నిబంధనలు జారీ చేసిన విషయం తెలిసిందే. విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో యూదు వ్యతిరేక నిరసనల కట్టడికి సంబంధించినవి అవి. అయితే, వాటిని వ్యతిరేకిస్తున్నట్లు విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ఇక్కడి నుంచి అసలు వ్యవహారం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ యూనివర్సిటీకి అందించే 2.2 బిలియన్ డాలర్ల ఫెడరల్ నిధులకు కత్తెర వేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో 1 బిలియన్ డాలర్ల కోతకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వైద్య పరిశోధనల కోసం యూనివర్సిటీకి ఇచ్చే ఫెడరల్ గ్రాంట్లు, కాంట్రాక్టుల నుంచి 1 బిలియన్ డాలర్లను తగ్గించాలని ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజాగా ఓ కథనం ప్రచురించింది. అయితే.. వైట్‌హౌజ్ జారీ చేసిన డిమాండ్లకు ఏ మాత్రం తలొగ్గేది లేదని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ స్పష్టం చేస్తున్నారు. వాటిని బహిరంగంగా తిరస్కరిస్తున్నారు కూడా. ఈ నేపథ్యంలోనే ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ నుంచి కొత్త బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. గార్బర్ చర్యలపై ట్రంప్ యంత్రాంగం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతిస్తామని హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి ట్రంప్ ప్రభుత్వం స్పష్టంచేసింది.

# మహేష్ బాబుకు ఈడి నోటీస్

## ఈనెల 27న విచారణకు పిలుపు


సాయిసూర్య డెవలపర్స్ యాడ్ పారితోషికం లెక్కలపై వివరణ



**హైదరాబాద్:** హీరో మహేష్‌బాబుకు ఈడీ అధికారులు నోటీసు జారీచేశారు. ఈనెల 27న విచారణకు హాజరై ఆధారాలు సమర్పించాలని సూచించారు. హీరో మహేష్ బాబు చాలా కంపెనీలకు ప్రమోటర్‌గా చేస్తున్నారు. అందులో సురానా గ్రూప్ కు చెందిన సాయి సూర్య డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ ఒకటి. ఈ సాయిసూర్య డెవలపర్స్ చెందిన వెంచర్స్ ను ప్రమోట్ చేశారు హీరో మహేష్ బాబు.. 30 అంటే 30 సెకన్ల యాడ్.. దీని కోసం హీరో మహేష్ బాబు అక్షరాల 5 కోట్ల 90 లక్షల రూపాయలు ఛార్జ్ చేశారు. ఇందులో 3 కోట్ల 40 లక్షల రూపాయలను బ్యాంక్ చెక్కు ద్వారా తీసుకున్నారు. మిగతా 2 కోట్ల 50 లక్షల రూపాయలను నగదు రూపంలో తీసుకున్నారు. ప్రకటనల రూపంలో హీరో మహేష్ బాబు రెమ్యునరేషన్ తీసుకోవటంలో తప్పు లేదుకానీ.. ఇక్కడే ఓ చిక్కొచ్చి పడింది. సురానా గ్రూప్, సాయిసూర్య డెవలపర్స్ ఆఫీసులు, ఇళ్లల్లో ఈడీ తనిఖీలు చేసినప్పుడు.. లెక్కల్లోకి రాని 100 కోట్ల రూపాయలను గుర్తించారు. ఈ డబ్బు అంతా హవాలా డబ్బు అని.. మనీలాండరింగ్ కింద గుర్తించింది ఈడీ. పన్నులు ఎగ్గొట్టటానికే సాయిసూర్య డెవలపర్స్ లెక్కల్లో 100 కోట్ల రూపాయలు చూపించలేదనే అంశంపై ఈడీ విచారణ చేస్తుంది. ఇందులో భాగంగానే.. ఆ 100 కోట్ల రూపాయల మనీలాండరింగ్ లోనే.. లెక్కల్లో చూపించని 100 కోట్ల రూపాయల నుంచే హీరో మహేష్ బాబుకు 2 కోట్ల 50 లక్షల రూపాయలను నగదు రూపంలో చెల్లించారా అనే అంశంపై క్లారిటీ కోసమే నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నగదు రూపంలో తీసుకున్న రెండు కోట్ల 50 లక్షల రూపాయలను.. మహేష్ బాబు ఇన్ కం ట్యాక్స్ రిటర్న్స్‌లో చూపించారా లేదా అనేది కూడా కీలక అంశంగా మారనుంది. ఈడీ నోటీసులపై.. హీరో మహేష్ బాబు ఇప్పుడు స్వయంగా హాజరు అవుతారా లేక తన లాయర్ ను పంపిస్తారా లేక కోర్టుకు వెళ్లి స్వయంగా హాజరు నుంచి మినహాయింపు కోరతారా అనేది చూడాలి.

# పెద్ది క్రికెట్ షాట్.. క్రెడిట్ మొత్తం అతనికే..

గేమ్ ఛేంజర్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో 16వ చిత్రంగా రూపొందుతుంది. గ్రామీణ వాతావరణంలో జరిగే స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో పెద్ది సినిమాను తెరకెక్కిస్తున్నట్లుగా ఓ టాక్ అయితే నడుస్తుంది. చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు శర్మ, జగపతిబాబులు కూడా ఇందులో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఏఆర్ రెహమాన్ స్వరాలు అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద సినిమా నుంచి ఫస్ట్ షాట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. వీడియోలో మాస్ అవతార్ లో చరణ్ కనిపించగా, "ఏదైనా నేలమీద ఉన్నప్పుడే చేసేయ్యాలి.. పుడాతామా ఏంటి మళ్లీ." అంటూ ఉత్తరాంధ్ర యాసలో డైలాగ్ చెప్పి అదరగొట్టాడు గ్లోబల్ స్టార్. ఇక గ్లింప్స్ చివరలో రామ్ చరణ్ క్రికెట్ షాట్ ఒకటి అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ షాట్ ఆలోచన ఎవరిది అనేది తాజాగా బుచ్చిబాబు వివరించారు. ఫైట్ మాస్టర్ నవకాంత్ ఆ షాట్‌ని డిజైన్ చేయగా, అతనికే ఆ క్రెడిట్ ఇవ్వాలని నేను అనుకుంటున్నాను అంటూ బుచ్చిబాబు చెప్పుకొచ్చారు. గ్లింప్స్ రిలీజ్ రోజు నేను రామ్ చరణ్ ఇంట్లో ఉన్నా. చిరంజీవి గారు కూడా అక్కడే ఉన్నారు. అయితే నచ్చుతుందా లేదా అని చాలా టెన్షన్ పడ్డాను. కాని చూశాక చిరంజీవి గారు చాలా బాగుంది అని అన్నారు అంటూ బుచ్చిబాబు తెలియజేశాడు. కరోనా టైమ్ లో పెద్ది ఆలోచన నాకు వచ్చింది. స్క్రిప్ట్ పూర్తి చేశాక సుకుమార్ గారికి వినిపిస్తే బాగుంది అని అన్నారు. రామ్ చరణ్‌కి కథ వినిపించమని అన్నారు. కాన్సెప్ట్, క్యారెక్టరైజేషన్ చరణ్‌కి బాగా నచ్చాయి. అలా ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లింది అని బుచ్చిబాబు పేర్కొన్నారు. ఇందులో చరణ్ ఆటకూలీగా కనిపించనున్నాడని టాక్.



# బాబోయ్.. ప్రభాస్ చేతిలో ఏకంగా 9 సినిమాలు ఉన్నాయా.. మైండ్ బ్లాక్..!

కృష్ణంరాజు నట వారసుడిగా ఇండస్ట్రీకి వచ్చి ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్ హీరోగా ఎదిగాడు ప్రభాస్. బాహుబలి సినిమాతో ఆయన స్థాయి అమాంతం పెరిగింది. పాన్ ఇండియా స్టార్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఇక బాహుబలి తర్వాత ప్రభాస్‌ని పలు ఫ్లాపులు పలకరించాయి. అయిన కూడా ప్రభాస్ ఇమేజ్ ఇసుమంత తగ్గలేదు. సలార్, కల్కి చిత్రాలతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న డార్లింగ్ ఇప్పుడు వరుస చిత్రాలతో ప్రేక్షకులకి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించాలనే కసితో ఉన్నాడు. గతంలో ఏడాది ఒక్క సినిమా చేస్తానన్న ప్రభాస్ ఇప్పుడు వరుస పెట్టి చేస్తున్నాడు. ప్రభాస్ ఖాతాలో చాలా సినిమాలు ఉండడంతో ఇప్పట్లో ఆయన ఫ్రీ అయ్యేలా కనిఇపంచడం లేదు. పలు సినిమాలు సెట్స్ పై ఉండగానే, ప్రభాస్ కొత్త సినిమాలకి ఓకే చెబుతున్నాడు. ప్రభాస్ చేతిలో మొత్తం 9 సినిమాల వరకు ఉన్నాయి. ఇక ఇప్పుడు మరో ప్రాజెక్ట్ ఒప్పుకున్నట్లు టాక్ నడుస్తుంది. తాజా సమాచారం ప్రకారం ప్రభాస్ ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. దర్శకుడు ఎవరు అనేది ఇంకా ప్రకటించలేదు కాని టాప్ డైరెక్టర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడని అంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తుండగా, ఈ చిత్రం భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు జరిగే కథతో తెరకెక్కుతున్నట్టు తెలుస్తుంది. ఇందులో ప్రభాస్ సైనికుడిగా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమాను రూ. 600 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఉన్న సినిమాల లిస్ట్ చూస్తే ముందుగా ది రాజా సాబ్ గురించి చెప్పుకోవాలి. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఫౌజీ.. స్పిరిట్..కల్కి 2898 ఏడీ పార్ట్ 2, సలార్ పార్ట్ 2, డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఒక ప్రాజెక్ట్, కన్నప్ప సినిమాలో గెస్ట్ రోల్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై మరో సినిమా వీటితో పాటు కేజీఎఫ్ నిర్మాతలు అయిన హోంబలే ఫిల్మ్స్ బ్యానర్ పై దాదాపు మూడు సినిమాలు చేసేందుకు ప్రభాస్ సిద్ధంగా ఉన్నాడు.. ఇన్ని సినిమాలతో ప్రభాస్ అలరించబోతున్నాడని తెలిసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.



# నెగిటివ్ రివ్యూలు ఇచ్చేవారిని మనం ఆపలేం : నాని



ఈ మధ్య విడుదలయిన తెలుగు సినిమాలకు మొదటిరోజు నుంచే నెగిటివ్ రివ్యూలు వస్తున్న విషయం తెలిసిందే. గతవారం విడుదలైన అర్జున్ సన్నాఫ్ వైజయంతీతో పాటు ఇటీవల విడుదలైన మ్యాడ్ స్క్వేర్ చిత్రాలకు పలు వెబ్‌సైట్స్ సినిమా బాగలేదని నెగిటివ్ రివ్యూలు ఇచ్చాయి. అయితే దీనిపై చిత్రబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమా బాగున్నకూడా కొన్ని వెబ్‌సైట్‌లు కావాలని నెగిటివ్ ప్రచారం చేస్తున్నాయని.. టాలీవుడ్‌లో రివ్యూలు బ్యాన్ చేయాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. తాజాగా ఇదే విషయంపై కథనాయకుడు నాని స్పందించాడు. నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మేకర్స్ ప్రమోషన్స్‌లో షురూ చేశారు. ఇందులో భాగంగానే వరుసగా ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నాడు నాని. తాజాగా ఒక ఇంటర్వ్యూలో నానిని.. సినిమా విడుదల కాగానే రివ్యూలు ఎందుకు అని ఈ మధ్య అంటున్నారు. దీనిపై మీ స్పందన ఏంటి అని అడుగగా.. నాని మాట్లాడుతూ.. సినిమాలకు రివ్యూలు ఇచ్చేవారు ఒకరోజు ఆగమని చిత్రయూనిట్‌లు చెబుతున్నాయి. వాళ్లు ఎందుకు ఆగుతారు. దీనిని ఒక్క రోజు లాగవచ్చు.. లేదా రెండు రోజులు లాగవచ్చు.. కానీ చెప్పాల్సింది మాత్రం ఆపరు. ఇంతకుముందు అంటే సోషల్ మీడియా లాంటివి లేవు. కానీ ఇప్పుడు ఏం చేసిన తెలుస్తుంది. కానీ రివ్యూలు ఇచ్చేవాళ్లు కూడా.. నాకు నచ్చలేదని చెప్పకుండా.. ప్రజలకు నచ్చట్లే అని చెప్పడం కరెక్ట్ కాదు. అందుకు నాకు నచ్చలేదని చెప్పండి.

# క్రీడా వార్తలు | SPORTS NEWS




# అతడొక అద్భుతం..

## చాలా క్లాస్‌గా ఆడుతున్నాడు: రాయుడు

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ యువ ఓపెనర్ సాయి సుదర్శన్ దుమ్మురేపుతున్నాడు. ప్రతీ మ్యాచ్‌లోనూ పరుగులు సాధించి గుజరాత్ జైత్ర యాత్రలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ సుదర్శన్ హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన సుదర్శన్.. 50 కంటే ఎక్కువ సగటుతో 417 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో సుదర్శన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల వర్షం కురిపించాడు. టీ 20 క్రికెట్‌ను ట్రెడిషనల్‌గా ఎలా ఆడాలో సుదర్శన్ చూపిస్తున్నాడని అతడు కొనియాడాడు. "సాయిసుదర్శన్ అద్భుతంగా ఆడుతున్నాడు. అతడి బ్యాటింగ్ చూసేందుకు రెండు కళ్లు సరిపోవడం లేదు. చాలా సంతోషంగా ఉంది. అతడు క్లాసికల్ బ్యాటర్‌గా ఆడుతున్నాడు. క్రికెట్‌ను సాంప్రదాయ పద్ధతిలో ఎలా ఆడవచ్చో తన బ్యాటింగ్‌తో చూపిస్తున్నాడు. సుదర్శన్ బంతి వేగాన్ని సరిగ్గా ఉపయోగించుకుని స్మార్ట్ క్రికెట్ ఆడుతున్నాడు. ప్రతీ మ్యాచ్‌లో పరుగులు సాధించడం అతడి ఆత్మవిశ్వాస్వాన్ని మరింత రెట్టింపు చేస్తోంది. సుదర్శన్ అద్భుత ఫామ్ జట్టు మొత్తాన్ని ప్రభావితం చేస్తోంది. అందరు ఆటగాళ్లు ఒకే లయలో ఆడతారు. ప్రస్తుతం గుజరాత్ టీమ్‌లో అదే మనం చూస్తున్నాము" అని జియో స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాయుడు పేర్కొన్నాడు.







# చెలరేగిన కేఎల్ రాహుల్.. లక్నోను చిత్తు చేసిన ఢిల్లీ

ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి కమ్‌బ్యాక్ ఇచ్చింది. ఎక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయాన్ని అందుకుంది. 160 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ కేవలం రెండు వికెట్ల మాత్రమే కోల్పోయి 17.5 ఓవర్లలో చేధించింది.ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 57 నాటౌట్), అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో చెలరేగగా.. అక్షర్ పటేల్ (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లతో 34 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. లక్నో బౌలర్లలో పార్ట్ టైమ్ స్పిన్నర్ ఐడెన్ మార్క్‌రమ్ ఒక్కడే రెండు వికెట్లు పడగొట్టాడు. మిగితా లక్నో బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

**మార్క్‌రమ్ హాఫ్ సెంచరీ..**


అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేసింది. లక్నో ఓపెనర్లు అద్భుతమైన ఆరంభం అందించినప్పటికి, మిడిలార్డర్ బ్యాటర్లు విఫలమకావడంతో నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది.లక్నో బ్యాటర్లలో ఐడెన్ మార్క్‌రమ్ (52) టాప్ స్కోరర్‌గా నిలవగా..మిచెల్ మార్ష్ (45), ఆయూష్ బదోని (36) రాణించారు. మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ నాలుగు వికెట్లు పడగొట్టగా..

# చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్..

టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్, ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ కేఎల్ రాహుల్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 5000 పరుగుల మైలు రాయిని అందుకున్న క్రికెటర్‌గా రాహుల్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్-2025లో భాగంగా ఎకానా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ ఈ ఫీట్ సాధించాడు. కేవలం 130 ఇన్నింగ్స్‌లలోనే కేఎల్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్(135) పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో వార్నర్ రికార్డును రాహుల్ బ్రేక్ చేశాడు. ఓవరాల్‌గా ఐదు వేల పరుగుల మైలు రాయిని అందుకున్న ఐదో క్రికెటర్‌గా రాహుల్ నిలిచాడు. రాహుల్‌కు ముందు విరాట్ కోహ్లి (8326), రోహిత్ శర్మ (6786), శిఖర్ ధవన్ (6769), డేవిడ్ వార్నర్ (6565), సురేశ్ రైనా (5528), ధోని (5377), ఏబీ డివిలియర్స్ (5162) ఐపీఎల్‌లో 5000 పరుగుల మైలురాయిని తాకారు. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. లక్నోపై 8 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయం సాధించింది. 160 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ కేవలం రెండు వికెట్ల మాత్రమే కోల్పోయి 17.5 ఓవర్లలో చేధించింది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్(42 బంతుల్లో3 ఫోర్లు, 3 సిక్స్‌లతో57 నాటౌట్), అభిషేక్ పోరెల్(36 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో చెలరేగగా.. అక్షర్ పటేల్(20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లతో 34 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. లక్నో బౌలర్లలో ఐడెన్ మార్క్‌రమ్ ఒక్కడే రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేసింది.

# టీమిండియా క్రికెటర్ మంచి మనసు..

## రూ.7 లక్షల ఆర్ధిక సాయం



టీమిండియా క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తన మంచి మనసును చాటుకున్నాడు. తమిళనాడుకు చెందిన పది మంది యువ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు రూ.7 లక్షల ఆర్ధిక సాయాన్ని దూబే చేశాడు. మంగళవారం జరిగిన తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (TNSJA) అవార్డ్స్ అండ్ స్కాలర్‌షిప్‌ల ప్రధానోత్సవ కార్యక్రమంలో యంగ్ అథ్లెట్స్‌కు దూబే చెక్‌లను అందజేశాడు. ఈ కార్యక్రమానికి దూబే ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. అదేవిధంగా యువ అథ్లెట్లకు వారి విజయాలకు గుర్తింపుగా తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కూడా రూ. 30,000 స్కాలర్‌షిప్‌లను అందజేసింది. ఈ సందర్భంగా దూబే మాట్లాడుతూ.. "ఈ కార్యక్రమం యువ అథ్లెట్లందరికీ చాలా ప్రోత్సాహకరంగా ఉందని నేను భావిస్తున్నాను. ఈ చిన్న విజయాలను గుర్తించి వారిలో కొత్త ఉత్సహాన్ని తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నింపుతోంది. వారు మరింత కష్టపడి పనిచేసి దేశానికి గర్వకారణంగా నిలుస్తారు ఆశిస్తున్నాను. ఈ అద్భుతమైన కార్యక్రామానికి నన్ను ఆహ్వానించిందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముంబైలో కూడా ఇటువంటి కార్యాక్రమాలు నేను చూశాను. ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో కూడా యువ క్రీడాకారులకు మద్దతునిచ్చే ప్రోగ్రామ్స్ నిర్వహిస్తుండడం చాలా సంతోషంగా ఉందని" అన్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జిల్లా వార్తలు | DISTRICT NEWS | బుధవారం, హైదరాబాద్ | 23-04-2025
ANN తెలుగు

# జర్నలిస్టుల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**వరంగల్, మహా;** జర్నలిస్టులతో నాకున్న వ్యక్తిగత అనుబంధంతో సందర్శించానని ఈ దీక్షను రాజకీయం చేయదలుచు కోలేదని మాజీమంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య స్పష్టం చేశారు. మంగళవారం గత తొమ్మిది రోజులుగా వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ సారయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల కోసమే ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందని ఇండ్లు లేని పేద జర్నలిస్టులకు న్యాయం జరగాలని అన్నారు. జర్నలిస్టులతో తొమ్మిది రోజులుగా జరిగిన దీక్షల సమీకరణలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్రికేయులతో వ్యక్తిగత సంబంధం ఉందని ఆ అభిమానంతోనే జర్నలిస్టుల శిభిరాన్ని వ్యక్తిగతంగా సందర్శించినట్లు తెలిపారు. దీక్షలు, నిరసనలు శాంతియుతంగా చేయడం ప్రతీ ఒక్కరి హక్కు బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల న్యాయం కోసం తన వంతు సహాయ సహకారాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గం లోని మంచాల, మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, మరియు యాచారం మండల కేంద్రంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన కేంద్రాలలో విక్రయించి, రైతులు విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొంది పొందాలన్నారు దళారుల మాటలు నమ్మి మరోచోట అమ్మినట్లయితే సరైన ధర రాకపోవడం, వారి చేతుల్లో మోసపోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ప్రభుత్వ నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మకాలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు, అధికారులు, ఈ చంద్రశేఖర్ మామ, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జయమ్మ, ముత్యాల రాజశేఖర్ రావు, నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష

## వేసవి వడగాలులు పై ప్రజలకు అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా;** వేసవి వడగాలుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో వేసవి వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణితో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. జూలై వరకు ఆశా కార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వడగాలుల వల్ల వచ్చే ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. సమ్మర్‌కు సంబంధించి జిల్లా, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ముఖ్యమైన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చల్లని తాగునీరు, చాలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సాంస్కృతిక సారధి కళాకారులతో వడగాల్పులపై ప్రచారం చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రా ల్లో టీచర్ల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి సమయాలను మార్చుకోవాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్టీసీ బస్ స్టాండ్ లలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, పశువులు సంచరించే ముఖ్య కూడలలో నీటి కుండీలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ విజయలక్ష్మి , జెడ్పి సీఈఓ రామి రెడ్డి, డిఎంహెచ్ఓ సాంబశివరావు, పిడి హౌసింగ్ గణపతి, డిసిఓ నీరజ, ఆర్డీవోలు సత్య పాల్ రెడ్డి ఉమారాణిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో ఆర్ఎంపిపై కేసు నమోదు


## స్టెరాయిడ్లు, యాంటీబయోటిక్స్ అనధికారంగా ఉపయోగం

**వరంగల్ మహా:** వరంగల్ జిల్లా మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ డాక్టర్ అయిన ఆర్ఎంపీ బి. జ్ఞానేశ్వర్ పై తెలంగాణా వైద్య మండలి రిజిస్ట్రార్ డా దండెం లాలయ్య, చైర్మన్ డా కె.మహేష్ కుమార్ ల అధికారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది. తెలంగాణ వైద్య మండలి (TGMC) అధికారుల తనిఖీల సమయంలో, రామన్నపేట ప్రాంతం లో బి. జ్ఞానేశ్వర్ అనే ఆర్ ఎం పి తగిన వైద్య పరమైన అర్హత లేకుండా కూడా ప్రజలకు స్టెరాయిడ్లు మరియు యాంటీబయోటిక్స్ ను అనధికారంగా ఇస్తున్నట్లు గుర్తించబడింది. ఈ చర్యలు ఎన్ఎంసి చట్టం 34,54, టి ఎస్ ఎం పీ ఆర్ చట్టం 22 కి వ్యతిరేకంగా ఉండటంతో, మట్టవాడ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయబడింది. టీజీఎంసి అధికారులు తనిఖీ సమయంలో అతను వైద్యుడిగా నకిలీ పద్ధతుల్లో పని చేస్తున్న విషయాన్ని స్పష్టం చేశారు. అనధికార వైద్యచికిత్స చేసే ఆర్ఎంపి ల వలన ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం పొంచి ఉన్నందున , ప్రజల ఆరోగ్యం కోసం తెలంగాణ వైద్య మండలి మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ఎట్టి పరిస్థితుల లో కూడ నకిలీ వైద్యవ్యవస్థ ని ఉపేక్షించేది లేదని తెలంగాణ వైద్య మండలి అధికారి వైస్ చైర్మన్ డా జి.శ్రీనివాస్,తెలియచేశారు.వన్ నకిలీ వైద్యులపై ఫిర్యాదు కోసం వాట్సాప్ ద్వారా 91543 82727 నెంబర్ లేదా ఇమెయిల్ ద్వారా antiquackerytsmc@onlinetsmc.in చేయవచ్చునని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రజా సంబంధాల కమిటీ చైర్మన్ డా వి. నరేష్ కుమార్ సూచించారు.

## హుజురాబాద్ ఎమ్మెల్యేపై

# కేసు నమోదు

**హన్మకొండ మహా;** హుజురాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ లో, మనోజ్ రెడ్డికి సంబంధించిన గ్రానైట్ క్వారీ నడవాలంటే డబ్బులు చెల్లించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేసారని గతంలో కూడా 25లక్షలు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వసూలు అక్రమంగా వసూలు చేశాడని బాధితుడు ఆరోపించాడు. మళ్ళీ నాలుగు రోజుల క్రితం ఏప్రిల్ 18వ తేదీన ఫోన్ చేసి 50లక్షలు ఇవ్వమని బెదిరింపుకు దిగినట్లు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించినట్లు మనోజ్ రెడ్డి ఫ్యామిలీ వెల్లడించారు. ఈ సందర్భంగా బాధితుడు కట్ట మనోజ్ రెడ్డి డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా 308(2), 308(4), 352 బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టి, ఎఫ్ఐఆర్ 252/2025 కింద పోలీసులు నమోదు చేశారు.


తేది: 21-04-2025
Received on 21/04/2025 at 21:00 hrs
AS per the contents of above petition I Registered a case in Cr no-252/2025 U/s 308(2),308(4),352 BNS and took up the Investigation
SIP Subedari PS.

# వెంకటాపురంలో 29 ఏళ్ల యువకుడు హత్య

## పాలకొల్లులో ట్రేస్ అయిన మొబైల్ సిగ్నల్

### వారం రోజులు తరువాత ఆచూకీ.. అక్రమ సంబంధానికి యువకుడు బలి

### తప్పు ఒప్పుకున్న నిందితులు.. ఈ నెల 18న పూడ్చిన మృతదేహం



**వెంకటాపురం మహా :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో నివసించే 29 ఏళ్ల సాయి ప్రకాష్ అనే యువకుడు గత వారం రోజులుగా అదృశ్యమైన సంగతి తెలిసిందే. మంగళవారం సాయంత్రం హనుమకొండ హాస్పిటల్ కి వెళ్లిన సాయి ప్రకాష్ తిరిగి ఇంటికి రాలేదని బుధవారం నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల వరకు సాయి ప్రకాశ్ ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన ఆయన తమ్ముడు సాయి తేజ ఈ నెల 18న హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. మొదట సాయి ప్రకాశ్ ఫోన్ సిగ్నల్ ఆంధ్రప్రదేశ్‌లోని పాలకొల్లులో కనిపించడంతో పోలీసులు అటువైపుగా దృష్టి సారించారు. అక్కడి పోలీసుల సహకారంతో ఫోన్‌ను ట్రేస్ చేయగా అది ఒక రైలులో ఉన్నట్లు గుర్తించారు. అయితే..సాయి ప్రకాశ్ ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రి వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ను క్షుణ్ణంగా పరిశీలించగా, సాయి ప్రకాశ్ కారును ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు అనుసరిస్తున్నట్లు గుర్తించారు. ఆ ఆటో నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు సాయి ప్రకాష్ నీ హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురానికి చెందిన శ్రీనివాస్ అనే కానిస్టేబుల్‌కు స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయాన్ని సాయి ప్రకాశ్ బయటపెట్టడంతో పోలీస్ ఉన్నతాధికారులు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. ఈ వివాహేతర సంబంధం బయటపడటానికి కారణమైన సాయి ప్రకాశ్‌పై కోపం పెంచుకున్న శ్రీనివాస్ తన ప్రియురాలితో కలిసి పథకం ప్రకారం అతడిని హత్య చేయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హుస్నాబాద్ సమీపంలోని ఒక బావిలో మృతదేహాన్ని పడేసినట్లు వారు చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లి సాయి ప్రకాశ్ మృతదేహాన్ని వెతగా మృతదేహం లభ్యం కాలేదు హుస్నాబాద్ పోలీసులు సంప్రదించగా ఈ నెల 18న గుర్తుతెలియని మృతదేహం సమాచారం మేరకు బావిలోని మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ పంపించి అనంతరం పూడ్చి పెట్టామని ఎస్ఐ మహేష్ చెప్పినట్లుగా బుధవారం పూడ్చిపెటిన మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం చేసిన అనంతరం బంధువులకి అప్పగించడం జరుగుతుందని హనుమకొండ పోలీసులు మీడియాకు తెలియజేశారు.

# ఏకశిల విగ్రహ ఆలయ అభివృద్ధికి మై హోమ్ సిమెంట్స్ ఆర్థిక సాయం



**హుజూర్ నగర్,మహా:** మఠం పల్లి మండలం గుండ్లపల్లి గ్రామంలోఇటీవలప్రతిష్టచేసిన 25అడుగులశ్రీఆంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ఆలయ అభివృద్ధి కోసం మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువు యాజమాన్యం రెండు లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇట్టి రెండు లక్షల రూపాయలు చెక్ ను సంస్థ యూనిట్ హెడ్ యస్. శ్రీనివాసరావు ఆలయ కమిటీకి అందచేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంస్థ యొక్క సామజిక కార్యక్రమములలో భాగంగా అన్న దాన కార్యక్రమమునకు ఆర్థిక సహాయం అందిచడం జరిగింది అని అన్నారు, సి.యస్.ఆర్ నిధుల నుంచి పరిసర గ్రామల యందు అభివృద్ధి కోసం సంస్థ ఎప్పుడు ముందు వుంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధి గుండా బ్రహ్మారెడ్డి, సంస్థ జనరల్ మేనేజర్ శ్రీ రామ్, ఏజియం శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో తొర్రూరు విద్యార్థికి రాష్ట్రస్థాయి ర్యాంకు




**తొర్రూరు, ఏప్రిల్ 22 ,మహా** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో తొర్రూర్ కు చెందిన గడల రామ్ చరణ్ రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించాడు. హనుమకొండ లోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న రామ్ చరణ్ మంగళవారం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను గడల రామ్ చరణ్ 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా ఇంటర్ ఫలితాల్లో ప్రతిభా జూనియర్ కళాశాల చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయదుందుభి మ్రోగించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎం అంజలి అనే విద్యార్థిని 466 మార్కులు, బి శరణ్య మోలి 464 మార్కులు, జి కీర్తన 452 మార్కులు, బి దీపిక, ఎం అభినవ్ అమృత 461 మార్కులు, బి హాసిని 460 మార్కులు సాధించారు. అదేవిధంగా సిఇసి విభాగంలో దియా మండల్ 469 మార్కులు సాధించారు. కాగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆర్ వైష్ణవి 986 మార్కులు 983 మార్కులు ఎం సోనియా 981 మార్కులు బైపిసి విభాగంలో ప్రియాంక బౌమిక్ 967 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల డైరెక్టర్లు కేఎల్ఎన్ ఆచార్య, కే సత్యానారాయణ రెడ్డి , శ్రవణ్ రావు, తిరుపతి తదితరులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి తమ కళాశాల ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# జల దృశ్యం నుంచి ఎల్కతుర్తి దాకా గులాబీ జెండా పోరు బాట - అభివృద్ధి మాట

## సకల జనుల సంక్షేమాన్ని కాంక్షించేది గులాబీ జెండా పార్టీ మాత్రమే

## మాజీ ఎంపీ శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్



**కరీంనగర్ , మహా:** జల దృశ్యం నుంచి ఎల్కతుర్తి దాకా... గులాబీ జెండా పోరు బాట,అభివృద్ధి మాట. సకల జనుల సంక్షేమాన్ని కాంక్షించేది గులాబీ జెండా పార్టీ మాత్రమే అని మాజీ ఎంపీ శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శివారులో ఈనెల 27 న నిర్వహించనున్న గులాబీ పార్టీ పాతికేళ్ళ భారీ బహిరంగ సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని శ్రీ బోయినపల్లి వినోద్ కుమార్ గారు అన్నారు. మంగళవారం ఎల్కతుర్తి బహిరంగ సభ విజయవంతం కోసం సిరిసిల్ల వచ్చిన సందర్భంగా వినోద్ కుమార్ విలేకరులతో మాట్లాడారు.గులాబీ జెండా భారీ బహిరంగ సభ కోసం జనం స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని, ఎవరిని తరలించడం లేదని వినోద్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వినోద్ కుమార్ గారు పేర్కొన్నారు. భారీ బహిరంగ సభ దిగ్విజయం కావడం ఖాయం అని అన్నారు.తెలంగాణ రాష్ట్రం తెస్తామని చెప్పి... తెచ్చి చూపించి తొమ్మిదేళ్ళ పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామీగా నిలిపిన ఘనత తమ అధినేత శ్రీ కెసిఆర్ గారికి దక్కుతుందని వినోద్ కుమార్ వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని వినోద్ కుమార్ గారు విమర్శించారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలు అయిందని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీజేపీ లు అనేక సార్లు పేర్లు మార్చుకున్నాయని ఆయన అన్నారు. ఈ కారిక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య గారు,వేములవాడ నిజాయకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు, మాజీ జేపీ చైర్మెన్ అరుణ రాఘవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ గారు, మాజీ మునిసిపల్ చైర్మన్ కళ చక్రపాణి గారు, రాష్ట్ర నాయకులు మనోహార్ రెడ్డి గారు, మాజీ జేపీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు,పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## భారత రాష్ట్ర సమితి రజతోత్సవ

# పోస్టర్ ఆవిష్కరణ

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హన్మకొండ మహా;** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రజక ఆత్మ బంధువు రజకులకు 250 యూనిట్ల ఉచిత కరెంటు ఇచ్చి ఐలమ్మ జయంతిని ప్రభుత్వం నిర్వహించేలా అలాగే రజకులకే బట్టలు వెళ్లే కాంట్రాక్టు మోడ్రన్ ధోబి గాట్లు ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలను రజకుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన మహనీయుడిని రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ అక్క రాజు శ్రీనివాస్ అన్నారు. వరంగల్ లో జరగబోయే భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సమావేశాలకు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా పాలకుర్తి నియోజకవర్గం కార్యకర్తలతో కలిసి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘాల సమితి రాష్ట్రచైర్మన్ అక్క రాజు శ్రీనివాస్, మాజీ ఎంపీపీవరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దురిశెట్టిచంద్రమౌళి .రాష్ట్ర బిజినెస్ సెల్ కన్వీనర్ నెమలి నరసింహులు. గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కమిటీలో వరంగల్ ఎంపీ



**హన్మకొండ, మహా;** లోక్ సభ, రాజ్యసభ సభ్యులతో కలిసి ఏర్పాటుచేసిన మహిళా సాధికారత కమిటీలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ను సభ్యురాలుగా నియమించారు. ఈ మేరకు లోక్ సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ ఒక బులెటిన్ విడుదల చేశారు. కమిటీ చైర్ పర్సన్ గా దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. లోక్ సభ నుండి లవ్లీ ఆనంద్ మరో 17 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభ నుండి సంగీతా బల్వంత్ సహా 9 మంది సభ్యులు ఉన్నారు.

# 29న చలో కలెక్టరేట్

## భువనగిరి జిల్లా సిపిఎం పార్టీ ఆఫిసు నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర - మహాధర్నా




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యల సాధనకై, ఏప్రిల్ 29న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా ఆఫిసు నుండి కలెక్టరేట్ వరకు జరిగే పాదయాత్ర మహాధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి కోరారు. సిపిఎం పార్టీ మండల, టౌన్ కమిటీల సమావేశం రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు, కూరేళ్ళ నర్సింహా, అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. పాలకులు మారుతున్నా , పాలన తీరు మారడం లేదని, ప్రజాసమస్యల పై సమగ్ర ప్రణాళిక లేక, అనేక సమస్యలు పెండింగ్ ఉంటూ ఏండ్ల తరబడి కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ నినాదం అభాసుపాలైందని నిరుద్యోగ భృతి, కనీస మద్దతుధర, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు, దారిద్య నిర్మూలన, లాంటి కేంద్ర బీజేపీ మాటలు నీటిమూటలే అయ్యాయని విమర్శించారు. మండలంలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, మూడు మండలాలకు సాగు తాగు నిరంధించే బునాదిగాని కాల్వ, 30 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల,లాంటి అనేక సమస్యలు పాలకులు మారిన పరిష్కారం కావడం లేదని విమర్శించ్చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం పార్టీ జిల్లాలో సరియైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని, ప్రజా సమస్యల సాధనకై జరిగే మహా ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, టౌన్ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య, కందుకూరి నర్సింహా, పానుగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేత మహేందర్ గౌడ్ 20వ వర్ధంతి

## ఆయన విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన భాజాపా నాయకులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తూ మావోహిస్టుల చేతిలో నెలకొరిగిన మహేందర్ గౌడ్ జీవితం, ప్రతి కార్యకర్తకు నిరంతరం స్ఫూర్తి నిస్తూనే ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకులు క్రమ శిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డిలు అన్నారు. 2004 ఏప్రిల్ 22న నక్సలైట్ల చేతిలో హతమైన అప్పటి మంచాల మండల బీజేపీ అధ్యక్షులు మునికుంట్ల మహేందర్ గౌడ్ 20వ వర్ధంతిని ఆయన స్వగ్రామం మంచాల మండలం, తాళ్లపల్లి గూడలో మంగళవారం కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నివాళులు అర్పించారు. తాళ్లగూడ గ్రామంలో మహేందర్ గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. జాతీయవాదమే ఊపిరిగా బావించి నమ్మిన సిద్ధాంతాలతో నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన నాయకుడు మహేందర్ గౌడ్ అంటూ పేర్కొన్నారు. నిరుపేద గీత కార్మికుల ఇంట్లో పుట్టి ప్రజా నాయకుడిగా, గాయకుడిగా వక్తగా పేరు తెచ్చుకున్న నాయకుడిని అన్యాయంగా మావోహిస్టులు బలితీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో చివరి నిమిషం వరకు జాతీయవాదమే శ్వాసగా బ్రతికిన మహేందర్ జీవితం నిరంతర ప్రేరణగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు తాను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉన్న విషయం గుర్తు చేసుకుంటూ మహేందర్ తో ఉన్న అనుబంధం షోషల్ మీడియా వేదికగా కార్యకర్తలతో పంచుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలోబీజేపీ మండల అధ్యక్షులు నూకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దన్నే బాషయ్య, మారగోని శ్రీశైలం, రమేష్ ముదిరాజ్, వివిధ గ్రామాల సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు దేప సంతోష్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.